
# తెలుగు పలుకుబడి

డా.జొన్నలగడ్డ మార్కండేయులు





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net



కౌముది ప్రచురణలు - 115

# తెలుగు పలుకుబడి

## డా.జొన్నలగడ్డ మార్కండేయులు



**తెలుగుభాషకు** ప్రాచీన హోదా సాధించామంటారు కొందరు. మరికొందరు తెలుగు పలుకు మృతభాష అయిపోతోందని గుండెలు బాదుకుంటున్నారు. ప్రాచీన హోదా వచ్చిందన్న సంతోషంగాని, మృతభాష కాబోతోందన్న విచారముగాని తెలుగు భాషకు ఏమీ మేలు చేయవు. అసలైన తెలుగు జాతీయ పదజాలము మనం మరిచిపోతున్నాం. తెలుగు పలుకుబడిని గుర్తించలేక పోయినా తెలుగు పలుకుబడిని సేకరించడం అందరి కర్తవ్యం అని చెప్పడమే ఈ వ్యాసావళి ప్రధానోద్దేశం.

# 1

**మనకు నుడికారముంది.** భావగాంభీర్యముంది. ఛందస్సు, యతిప్రాసలు, అలంకారములు, ముఖ్యంగా అంత్యానుప్రాస తెలుగువారి మాటతీరులో అణువణువునా లీనమై ఉన్నాయి. అందుకే తెలుగువారి పలకరింపులు సంగీత సరిగమల్లా లయాన్వితంగా ఉంటాయంటే కొట్టిపారేయకూడదు. వినదగు నెవ్వరు చెప్పిన అంటూ తెలుగు తీయపు పలుకు నుడికారపు పదసంపదను ఎవరికివారు అందజేసుకునే ప్రయత్నం చేద్దాం.

ఒక్క ఇటాలియన్ భాషకు మాత్రమే సంగీత మాధుర్య ఝురి ఉందంటారు. 'మీది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అంటే విని సంబరపడడం మన సంస్కారం. దేశభాషలందు తెలుగు లెస్స అన్న రాజకవి మన రాయల స్వర్ణయుగమును గురించి చెప్పడానికి వేదికలు కడతాం. మాండలిక తెలుగు పలుకుల భాషా సౌందర్యంతో కథలు వ్రాసే ఆస్వాదించగలము. ఐనా మనకు అన్యభాషా ప్రావీణ్యంపై మోజెక్కువ. అందుకే పేరడీలు సృష్టించి దేశ భాషలందు తెలుగు less (లెస్సు) అని కించపరచుకునే స్థితికి దిగజారేవారు తయారయ్యారు. తెలుగు పదప్రయోగ సంగీత మాధుర్య విశిష్టతను తెలియచెప్పవలసిన కర్తవ్యం తెలుగువారందరిపైనా ఉంది.

నిత్యసత్యాలు, జీవితానుభవాలు, ఆచారాలు, నమ్మకాలు, వృత్తులు, సంస్కృతి... ఇవి సంప్రదాయ విజ్ఞానంగా తరతరాలనుంచి అందుకుంటున్నాము. ఈ తరతరాలమధ్య నడచిన సంభాషణ ప్రక్రియ భాష. మాండలికాల్లో బేధాలున్నా, ఈ సంభాషణ ప్రక్రియ తెలుగువారి హృదయ స్పందనను ఒకేలా ప్రతిధ్వనించి ప్రతి తరంలోని పూర్వానుభవాన్ని చాటుతుంది.. జాతీయ విభేదాలను మించిన ఒక ఐక్యత భారతీయతకుంది. అందుకే అన్యభాషా సంపర్కం వలన భాషకు మాండలికాలు ఏర్పడ్డాయి. మాండలికములతో తెలుగు పలుకు వేరువేరు అర్థాలు ధ్వనింపచేసినా, నుడికారము కలిగిన జాను తెనుగు సంభాషణ, అసలు సిసలైన తెలుగువారి పలుకుబడి, దేశమంతా ఒకేలా ఎలా ఉంటుందో తప్పక తెలుసుకోవాలి.

ఒక నీతి వాక్యం, ఒక పద్యపాదము, ఒక వేదవాక్యము, ఒక వేదాంత సత్యం వీటిని మన సంభాషణలో చొప్పించి పండితులనుంచి, పామరుల దాకా మన భాష నిత్యప్రవాహినిలా సాగుతూనే ఉంది. డు,ము,వు,లు చేర్చి సంస్కృతపదాల్ని తెలుగుగా మార్చినా, జానపద సాహిత్యానికీ అసలైన తెలుగు అందాలకీ కవులు దూరంకాలేకపోయారన్నది దగ్గరగా పరిశీలించవలసిన విషయం. ఎందుకంటే నాగరికత ప్రభావంవల్ల పాలకుల భాష పాలితులకు వ్యవహారంలో చేర్చుకోక తప్పలేదు. ఉదహరణకు ప్రపంచ వ్యాప్తంగా వాడబడుతున్న ఇంగ్లీషు పదాలు రైలు, రోడ్డులాంటివి సులభ గ్రాహ్యమవుతున్నపుడు సామాన్యులు కూడ తెలుగు పదాలు వాడడము లేదనే దురభిమానము భాషాభివృద్ధి అనిపించుకోదు. పై పెదవిని క్రింది పెదవిని ముద్దుగా ఒకటి చేస్తున్న 'అమ్మ' తెలుగు పలుకు మాధుర్యము 'మమ్మీ'గా భాషా పరిచయ ప్రదర్శనశాలకు తరలిపోవడం మాత్రం ఆహ్వానించదగినది కాదు. జీవ భాషకు అన్యభాషా పదాలు చేర్చడం భాషకు బలమేకాని శిరోధార్యమై అవహేళనకు గురికాకూడదు. అన్యభాషా పద సంపర్కము విశృంఖల విహారంగా భావదారిద్రానికి పరుగులు తీస్తేనే ఏ భాషైనా మృతభాష అవుతుంది.

ఊహ, తర్కం, భావలహరి మనలోని రసభావ హృదయ తంత్రులను పలికించగల పదం ఏ భాషదైనా ఆహ్వానించ తగినదే! నన్నయ, చిన్నయలను దాటి మరోప్రపంచపు 'శ్రీ శ్రీ' యుగం నుంచి నేటివరకు తెలుగు అన్యభాషా పదాలను స్వంతం చేసుకుంటూనే ఉంది. అయితే ముడి సరుకును మనం దూరం చేసుకుంటున్నాం. సంకర భాషా పదజాలము లేని తెలుగు భాషా పదజాలమే జాను తెనుగు ముడిసరుకు. దీనికే నుడికారము లేదా పలుకుబడి అనిపేరు.

మాండలిక పదప్రయోగ యాస ఎవరిప్రాంతానికి వారిది ఉన్నా తెలుగుజాతీయ పద సంపద అందరికీ ఆమోదయోగ్యమయినది ఉంది. దీనినే పలుకుబడి లేదా నుడికారము అని చెప్పుకోవచ్చు. ఈ జాతీయ భాషా పదజాలం, ఉపేక్షమూలంగా మూలబడిపోతోంది. తద్వారా తెలుగు భాష ,దేశీయ భాషారంగం నుండి మాయమయిపోయే దుస్థితి దాపరిస్తోంది. ఇందువల్లనే తెలుగుభాష ఉనికి భవిష్యతరాలకు హెచ్చరికలు చేస్తోంది. 'పసిడి పలుకులు' అని తెలుగు జాతీయ సంపదను భద్రపరచవలసిన అవసరాన్ని నేదనూరి గంగాధరం వంటి వారు గ్రంథస్థం చేసి చెప్పారు. ఆ కర్తవ్యంలో మనమూ పాలుపంచుకోవాలి.

'దేశభాషలందు తెలుగులెస్స', అనో లేక 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనో సంబరపడే మనం తెలుగుకున్న ప్రత్యేకత గురించి తెలుసుకోవాలి. సంకరపదజాలములు లేని అసలు సిసలైన తెలుగు జాతీయ సంప్రదాయ విజ్ఞాన సంపదగురించీ, పదజాల ప్రయోగ పలుకుబడి గురించీ తెలుసుకోవాలి..

ప్రస్తుతానికి పలుకుబడి అంటే నుడికారం అనుకుందాం. ఈ నుడికారపదాలకి భావవ్యక్తీకరణ కోణంలో ఉన్న అర్థంవేరు, స్ఫురించే అర్థం వేరుగా ఉంటుంది. ఇది తెలుగువారి చమత్కారానికి నిదర్శనం. 'ఉద్యోగం చేస్తూ పెళ్ళికాని బ్రహ్మచారి సెల్ఫ్ కుకింగ్ వల్ల అవస్థలు పడుతున్నాడ'ని నేడు ఇంగ్లీషులో అంటున్నాం. 'చెయ్యికాల్చుకుంటున్నాడు' అని తెలుగులో అంటే చమత్కారంతో కూడిన ప్రశంశగా లేదూ! నిండు మనిషి, నీళ్ళుపోసుకుంది అనడంకన్న 'ప్రెగ్నెంట్'అన్న పదం మనకు ఎందుకు అలవాటవ్వాలి? ఆలోచించవలసిన అవసరముంది. ఒకరి చేతిక్రింద పనిచేయకుండా స్వతంత్రంగా జీవించేవాణ్ణి 'వాడొకరి మోచేతి క్రింద నీళ్ళు (గంజి) త్రాగడు' ఎంత ఆత్మాభిమానంగలమాట! పౌరుషానికి ప్రతిరూపాలైన 'నాగులేటి నీళ్ళు', 'బొబ్బిలి చిల్లపెంకులు' వంటి ఆత్మాభిమాన పలుకుబడిని ప్రతిబింబించే మాటలు, మన సంభాషణలనుంచి నిష్క్రమించి ప్రాంతీయ దురభిమానులకు ఆయుధాలవుతునాయి.

తెలుగువాళ్ళు పెద్ద పెద్ద కేకలుపెడుతున్నవారిని 'ఇంటిమీది పెంకులెగరకొడుతున్నాడురా' అంటారు. అకారణంగా ఎవరిజోలికేనా వెళితే 'ఉత్తపుణ్యానికి' అన్న పదాన్ని చేర్చి మాట్లాడతారు.'ఆ ఇంటిమీది కాకి ఈ ఇంటి మీద వాలదు' 'పచ్చగడ్డి భగ్గుమంటుంది'

అంటూ ఇద్దరి మధ్య ఉన్న వైరాన్ని చిత్రంగా ఇమిడ్చారు. ఎక్కువ సంతోషపడేవారిని చూసి 'ఎగిరిగంతేస్తున్నాడురా!' అంటారు. Rivalary, happy వంటి మాటలు వచ్చేసి ఈ జాతీయాలను పొట్టన పెట్టుకున్నాయి.

ధ్వని అనుకరణ, జంటపదాల మాటలు మనం ఉపయోగించడం అరుదైపోతోంది. వావ్, నైస్, ఫెంటాస్టిక్..లాంటివి మన ఊతపదాలను కనుమరుగు చేస్తున్నాయి. 'తెలిసిందా.. ', 'దేవుడు చాలా మేలు చేస్తే.. ', 'తస్సారవాలా.. ', 'తస్సాదియ్యా.. ', 'ఏతావాతా.. ', 'ఆపళంగా.. ', 'ఇంకో విషయం..', 'ఇదుగో చూడండి..', 'మరిగంటే.. ', 'అర్థమయిందా', ఇవన్నీ అచ్చమైన తెలుగు ఊతపదాలు. 'వావ్'లాంటి ఇంగ్లీషు ఊతపదాలు మనవాడుక భాషలో స్థిరపడిపోవడము నాగరికత మార్పుకే తప్ప భాషకు అందమిస్తాయంటే ఒప్పుకోను. 'ఉక్కిరిబిక్కిరి ', 'అల్లిబిల్లి', 'సతమతము', 'పిల్లాపీత', 'వానావంగుడు', 'రామలక్ష్మణులు', 'అత్తాకోడళ్ళు', 'చిలకాగోరింకలు' ఇలాంటి పదప్రయోగ వైచిత్రి వెనుక తెలుగువారి సజీవ నుడికారపు సొంపు ఉంది.

'పకపకనవ్వాడురా' అంటాము. 'చకచకా పరుగెత్తాడు' 'రెపరెపలాడుతూ జెండా ఎగిరింది', 'మలమలా మాడిపోతున్నాము' అంటాము. 'అబ్బబ్బ', 'అన్నన్న', 'కటకట', 'గిజగిజ', 'ధగధగ', 'కిచకిచ' అనే ధ్వని అనుకరణ - 'అందచందాలు' 'మన్నుమిన్నుగా ఏకరువు  పెట్టినా అత్తాకోడళ్ళు', 'ఎండవానలు', 'ఉప్పుకారాలు' వంటి విడదీయలేని జంటపదాలులాగా పుచ్చపువ్వులాంటి వెన్నెల ఉపమానకాంతిలో మనసు పెట్టి వెతకమనడము అవసరమని చెప్పుకోవల్సివస్తే తెలుగు భాషకు ప్రమాదమేర్పడినట్లే లెక్క.

వెన్నెలకు ఉపమానమైన పుచ్చపువ్వులాగే వస్తువులను కాని వ్యక్తులను కాని వర్ణించేటప్పుడు మనకు ఆహ్లాదకరమైన ఉపమానాలున్నాయి. "నిక్షేపములాంటి పిల్ల - పెళ్ళినడకలు - మెరికలాంటి మనిషి - అగ్గిపిడుగు - మణిపూస - వెన్నపూసలాంటివాడు - ఉక్కుతునకల్లాంటి మాటలు - పాముపగ - కోడినిద్ర - బోడి పెత్తనం..." 'నీ కడుపు చల్లగా', 'నీ అమ్మ కడుపు బంగారం కాను' అనే దీవనలు' 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక, పెదరెడ్డొచ్చెమొదలాడరా... కోడికుంపటి' వంటి ఆసక్తి కథాంశముగల దెప్పుళ్ళు వ్యాసాలలో వివరణకు మాత్రమే పనికివస్తున్నాయి. 'నీ అమ్మ', 'నిన్ను గోతిలో పెట్టా' వంటి తిట్ల జాబితాని అనాగరిక జాబితాలో చేర్చి ఏనాడో ప్రజలు విడిచి పెట్టేశారు. ఐతే వీటినే 'హాస్యం' పేరిట సినిమాల్లో తెలుగు పలుకుబడిగా సజీవము చేసే అపహాస్య ప్రయత్నం దురదృష్టకరం. దేవులపల్లి, ఆరుద్ర, ఆత్రేయ, పింగళివంటివారి సజీవమైన తెలుగు పలుకులు చదివినా, విన్నా, చూసినా పరవశం కలుగుతుంది. అలాంటి మన తెలుగుభాష నుడికారముతో మనసున మల్లెలు పూయిస్తూనే ఉంటుంది. మానవస్వభావ చిత్రీకరణను, నాగరికతను నింపిన తెలుగు నుడికారపు సొంపుని, పత్రికలు, సంస్కార రచయితలుతో బాటు తెలుగువారందరూ మాట్లాడి చూపించగలరని నా నమ్మకం.

✡ ✡ ✡




# 2

**మనకట్టు, బొట్టు,** మాటతీరు, ఎక్కడున్నాసరే మనకో ప్రత్యేక గుర్తింపునిచాయి. అవి ప్రపంచంలో ఏ మారుమూల ప్రదేశములో ఉన్నామన హుందాతనానికి, వివేకానికీ చిహ్నాలుగా మనల్ని పటిస్తాయి. ప్రపంచ దేశాల మధ్య ఈ ఇంటర్నెట్ యుగంలో దూరం తరిగిపోయింది. అందుచేత కట్టు, బొట్టు విషయంలో నిబంధనలు బాగా తగ్గిపోయాయి. అయినా వివాహం, పండగలు, పబ్బాలు మొదలైన ఆచారవ్యవహారాలలో సంప్రదాయ ముద్ర, మనల్ని మన సంస్కృతిని పరి రక్షించి మనము తెలుగువారమని మన కట్టు, బొట్టు ద్వారా చాటి చెపుతుందంటే అసత్యం కాదు. కట్టుబొట్టు ఒక ప్రత్యేక ఆకర్షణే! కాదనలేం. అయితే మాట్లాడడం కూడ ఒక కళ.

మాట్లాడడం చేతకాకపోతే 'ఊరుకున్నంత ఉత్తమము' లేదంటారు. అయితే కొందరిమాట కటువుగా ఉండడమేకాక యదార్థమే అయినా కొంచెం హుందాగా మాట్లాడి ఉంటే బాగుండును అని అనిపించేలా ఉంటుంది. ఏ దురుద్దేశము లేకపోయినా మాట్లాడడము చేతకాదనిపించుకునే పరిస్థితి ప్రతివారికి జీవితంలో ఒక్కసారైనా ఎదురవుతుంది.

ఒకప్పుడు పూర్తిగా తెలుగే మాట్లాడే రోజులలో మన పూర్వీకులు అమంగళార్థము స్ఫురించకుండా జాగ్రత్త పడేవారు. తెగిపోయింది అంటే వచ్చే అపార్థాన్ని తొలిగించడానికి మంగళసూత్రం విషయంలో 'పెరిగిపోయింది' అనే పదాన్ని సృష్టించి 'తెగిపోయింద'న్నపుడు వచ్చే అమంగళార్థాని దూరం చేశారు. 'దీపం కొండెక్కింది' అనేవారు తప్ప ఆరిపోయింది అంటే అనవద్దు అనేవారు. లేదు అనేకన్న 'నిండుకుంది' అని చెప్పడమే హుందాగా భావించారు. సాధ్యమైనంత వరకూ పలుకు బడిలో కటుత్వం కన్న మార్ధవంతో కూడిన ఆర్ద్రత తెలుగు పలుకుబడిలో ఎక్కువ.

ఉదాహరణకు తెలుగు పలుకుబడిని చూడండి. తీసుకున్న డబ్బు ఎగవేసినపుడు 'ఆముదం రాశాడురా' అంటారు దుఃఖం వచ్చినపుడు 'కడుపు చెరువైపోతుంది' అంటారు. కోపతాపాలు వచ్చినపుడు 'కారాలు మిరియాలు నూరుతున్నాడు' అంటారు. పని జరిగిందీ లేనిదీ తెలుసుకోవడానికి 'కాయా? పండా?' అని అడుగుతారు. మహాకవులు కారణంగానే జనసామన్యంలో పురాణాలలోని

పదాలు సజీవంగా తెలుగు పలుకుబడిలో నిలిచిపోయాయి. 'బ్రహ్మాండం' అనే మాట భాగవతంలోనిది. శ్రీమన్నారాయణుడు బలి చక్రవర్తి ఇచ్చిన నేలను గొప్పగా ఆక్రమించాడు. ఆ అర్థం వచ్చే బ్రహ్మాండ పలుకుబడిని సింప్లీ సుపర్బ్ అనే పదం బ్రహ్మాండంగా తెలుగును మింగేస్తోంది. 'వెల్కం' అని ఆనందాన్ని వ్యక్తం చేయడానికి పూర్వికులు "ఊరకరారు మహాత్ములు" దయచేయండి అనివాడిన పదములు వాడుకలోంచి ఎందుకు నిష్క్రమిస్తున్నాయి?

ఒకప్పుడు తెలుగు సీమలో ప్రతిభోజన ఫలహారశాల ముందు 'దయచేయండి' అనే ఆహ్వానం ఉండేది. 'దయచేయండి' అనే పదం ఇప్పుడు 'పొండి' అనే వెటకారపు పలుకుబడికి ఉదాహరణ అవుతోంది. ఎందుకంటే ఇప్పుడు ఇంగ్లీషు భాష, ఒకప్పటి సంస్కృత భాషలా మన జీవితంలో అంతర్భాగమైపోయింది. ఇదివరకు ఉభయ భాషా ప్రవీణ అంటే తెలుగు సంస్కృతాలు అనర్గళంగా మాట్లాడగలిగి మెప్పించేవాడని అర్థం. ఇప్పుడు భాషాప్రవీణ కళాశాలలు మూతబడిపోయే పరిస్థితులలో 'అశ్వత్థామ హతః కుంజర:' లా సంస్కృతాన్ని పైకి కనబడనీయకుండా తెలుగుపండితుల్ని తయారు చేస్తూ ఓరియంటల్ బి.ఏ పట్టాలతో తెలుగు, ఇంగ్లీషు నేర్పుతున్నాయి. అందుచేత తెలుగు, సంస్కృతాలకన్న ఆంగ్లభాషా పదప్రయోగ ఉపన్యాసక పండితులు తెలుగు సాహిత్య పలుకుబడి గొప్పతనాన్ని చెప్పే ప్రయత్న ప్రయాణంలో, దేశవిదేశాలలో తమ ఆంగ్ల భాషా ప్రవీణత 'అలవాటులేని ఔపాసనం మీసాలను కాల్చింది' అన్న చందంలా తెలుగు పలుకుబడికి సమాంతరంగా పెరిగే అవకాశాన్నిస్తున్నారు. సహజ భావాలు, అంద చందాలు, ఛందస్సు, యతి ప్రాసలు, శబ్దాలంకారాలు, అంత్యప్రాసలు, పదలాలిత్యం, భావగాంభీర్యం తెలుగు పలుకులో ఉపయోగించినవి మనం మరిచిపోతున్నాము.

'మబ్బు విడిచిన ఎండ భరించలేము.' 'అప్పుదొరికితే పప్పుకూడు.' 'కళ్యాణము వచ్చినా, కక్కు వచ్చినా ఆగదు.' 'ముంజేతి కంకణానికి అద్దమెందుకు' 'చల్లకు వచ్చి ముంత దాచనేల' ఇలా ప్రసంగ వశాన ఆకట్టుకునేవి వినుటకు ఇంపు కలిగించేవి మనందరికీ వచ్చినవి ఉద్దేశపూర్వకంగానే సంభాషణలలోంచి దూరం చేసుకుని తేటతెలుగు తీయన అని అనకుండా sweetest language అనే పదప్రయోగానికి అలవాటు పడడం అవసరమా?.

తెలుగువారి పలుకులతీరు, తలుపుల తీరు కూర్పుల తీరు నిత్యవ్యవహారములోనే కవిత్వ గానములుగ కలగాపులగంగా ఉంటాయన్నది పెద్దలమాట.

తెలుగుబడి చిన్నతనలోనే అలవాటవ్వాలి. 'పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా..', 'నానాటికి తీసికట్టు నాగం భొట్లు..' ఇవి పద్యపాదాలు. తల్లిదండ్రులను ఈసడించినా, ఉన్నత స్థానం నుంచి పతనమైన వారిని చూసినా ఇవి అలవోకగా సంభాషణలలో దొరిలే అలవాటు తెలుగు వారిది. నీతిశతకాలు, వేమన్న వేదం మన తెలుగు పలుకుబడి. ఆయా పాదాలలోని కుదించబడ్డ నీతి తెలుగు పలుకుబడిగా సంభాషించడానికి నేటి తరం దూరమవడం అందరినీ ఆలోచింప చేయవలసిన విషయం. ఎందుకంటే ఒకతరంలో ప్రతిభావంతులైన కవుల, రచయితల పాత్రలు, నీతులు జనసామాన్యాన్ని ప్రబోధం చేసి సంభాషణలలోకి ప్రవేశించాయన్నది నిజం.

లయ, యతి ప్రాసలు మన ఆటపాటలలో కూడా ఉన్నాయి. అవి సేకరణకు మాత్రమే పరిమితమయ్యాయి. ఆ సేకరణ చూసినపుడు 'ఓహో' అనే తెలుగుమాటకన్న 'వావ్' అనే వారిలో తెలుగువారే "పొలాలనన్నీ హలాల దున్ని.. ఇలాతలంలో హేమం పిండగ బలం ధరిత్రికి బలికావించే కర్షక వీరుల ఘర్మజలానికి, ధర్మజలానికి.. ". అని వృత్యనుప్రాస అంత్యప్రాసతో పరుగెత్తించిన శ్రీశ్రీ 'పొలం', 'హలం' 'ఇలాతలం' పదాలు జనసామాన్యము నుంచే స్వీకరించాడు. తెలుగు అందాలనే అందించగలిగాడు. 'పతితులార, భ్రష్టులార, బాధాసర్పదష్టులార' అనే అంత్యానుప్రాస తెలుగు అందంతో సమాజాన్ని ఛందస్సుకాని ఛందస్సుతో పలకరించాడు. అయితే ఛందస్సు, యతిప్రాసలు అలంకారములతో కవులతో సమానంగా తెలుగుపలుకుబడిని సజీవంగా నిలిపిన ప్రయత్నం తెలుగు పలుకుబడి గర్వించదగిన సంభాషణ ప్రక్రియ తెలుగు సామెతల సృష్టికర్తలది. వాళ్ళు ప్రజాకవులు. చక్కటి దృష్టాంతాలనందించిన సామెతలలోని

తెలుగుపలుకుబడిని ఆస్వాదించేముందు తెలుగు కవుల గురించి చెప్పిన ఒక కవిగారి మంచి మాటను చెప్పుకుందాం. "కవులకంటె తుహిన కర్పూర నిభకీర్తి -- తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి సాహితీ తరంగ రసధుని - దేశభాషలందు తెలుగులెస్స"

✡ ✡ ✡




## 3

**తెలుగుపలుకుబడి** అయిన ధ్వని అనుకరణ, జంటపదాలు, ఊతపదాలు, పోలికలు, వీటన్నింటినీ కలబోసుకుని కాలక్షేపపు కబుర్లకు నీతిదాయకమైన చమత్కారపు ఆర్యోక్తిగ నిలుస్తుంది సామెత. ఏదో సామెత చెప్పినట్లు -- అంటూ నిత్యజీవితంలో ఏదో ఒక సమయంలో సామెతను ఉపయోగించని మానవుడుండడు. అందుచేత సామెత ఏదో ఒకదేశానికి, ప్రాంతానికి, రాష్ట్రానికి పరిమితంకాదు. జీవభాషయగు ఎవరి మాతృ భాషలోనైనా సామెతలుండడమే కాక దేశకాల పాత్రానుగుణముగ ఇతర భాషా సామెతలు కూడా ప్రవేశించి మాటకారితనానికి చమత్కార పోషకమై చోటు చేసుకుంటాయి. సామెతలుపయోగించి మాట్లాడడము కళే అయినా సామెతలుపయోగించకుండా మాట్లాడనివాడు ఏ భాషలోనైనా సరే అరుదే!

మానవుని జీవితం అతి పవిత్ర రాగబంధాలవలయం... ఈ రాగ వలయంలో చోటుచేసుకున్న అసూయా ద్వేషాలు, కష్టసుఖాల అనుభవ పరంపరలు హెచ్చరికగ సూత్రబద్ధము చేసి అందించిన నీతివాక్యాలు సామెతలు. సామెతలను ఎవరూ రచించరు. శక్తిగల పదగుంభనతో సామెతలు తరం నుంచి మరో తరం జనజీవన సంభాషణ స్రవంతిని ఓలలాడిస్తున్నాయి. శ్రీగిడుగు సీతాపతి మానవుని జీవితచ్ఛాయలే సామెతలన్నారు. జాతి సంస్కృతిని సంపుటీకరించు రసగుళికలు సామెతలని పసిడిపలుకుల కర్త నేదునూరి గంగాధరంగారి మాట.

చిలికి చిలికి గాలివానలాగ సామెతలు మన సంభాషణలోంచే పుడతాయి. వేమవరం వెళ్ళిన పుల్లయ్య, కోడికుంపటి లేకపోతే తెల్లవారదనుకున్న ముసలమ్మల వంటి వేపకాయంత వెర్రి అమాయకుల తెలివితక్కువ పనో లేక ఏదేని అసాధారణ సంఘటనో హేళన భరిత సంభాషణ హెచ్చరిక సామెతలుగా కనిపిస్తాయి. ʻఉంగరాల చేతితో మొట్టితే నొప్పి ఉండదనిʻ మనకన్నా అధికులు దండన విధిస్తే గౌరవించి సరిపెట్టుకుంటూనే బంగారపు పళ్ళెమైనా గోడకు చేరబడుతుందని చురకలంటించగల తెలుగుపలుకుబడి సామెతలది. కుక్క, గాడిద, నక్క పంది, కోడి, పిచ్చుక.... మొదలైన జంతువులు, పక్షులు... వాటితో పోలిక పెట్టి కాలక్షేపానికి తయారైన కథలు,

కబుర్లు ఆర్యోక్తులయ్యాయి. వ్యవసాయ, వైద్య, జ్యోతిషశాస్త్ర సమ్మత నమ్మకాలు, అనుభవాలు, పురాణాలు ఆ పురాణపురుషుల నీతి అవినీతిదాయక ప్రవర్తన సందేశాత్మక పలుకుబడిగ సామెతలలో కనిపిస్తాయి. అందుచేత సామెతలు తెలుగు సంభాషణకు అందిన అనుభవామృత బిందువులు అని నిర్వచించేవారి మాటలలో అతిశయోక్తి లేదు అని చెప్పవచ్చు.

మనది పుణ్యభూమి. అందుచేత నిత్యజీవితంలో ఏదో సమయంలో ఎప్పుడో ఒకప్పుడూ ప్రతివారు "భగవంతుడు -- కర్మ"... ఈ రెండుపదాలు సంభాషణలో ఉపయోగిస్తారు. అంతా మన కర్మ - అనుభవించక తప్పదు అంటూ దేవుడు మేలుచేస్తే అనే ఆధ్యాత్మిక పలుకుబడిలో సామెతలున్నాయి.

ఈ విధంగా సామెతలు తెలుగు పలుకుబడిగ సంఘ కట్టుబాటును, ప్రవర్తనను మీరిపోనీకుండా సంస్కృతి, సంప్రదాయముల పరిరక్షణలో మనకు చురకలు వేస్తాయి. జాతివిభేధాలను మించిన ఐక్యతతో ప్రసంగవశాన లోకములో ప్రచారమవుతున్నాయి. అలా అని అవి అన్నీ అర్ధవంతమైనవి కావు. 'అబద్దాలాడితే ఆడపిల్లలు పుడుతారు'.. ప్రాస కుదిర్చి మాట్లాడిన ఈ తెలుగునాట నేటికీ చాలామంది మాటకు ముందు బూతుపదము ప్రయోగించకుండా ఉండలేరు. సభ్య సమాజంలో ఉండే పలుకుబడివల్ల ఆ బూతుల రాయుళ్ళ పలుకుబడికి గౌరవము కాని గౌరవము ఉన్నమాట నిజము. బూతుపలుకుబడి మాన్చుకోలేని పెద్దల అలవాటును సంస్కారహీనమని గాని, వారు సభ్యత లేనివారని చెప్పడం నా ఉద్దేశం కాదు. కొందరికి అలవాటుగ ప్రసంగవశాన సాగే ఈ పలుకుబడి చలన చిత్రాలలో ధ్వనిప్రధానముగ బూతు పలుకుబడికి తెరతీయడం తెలుగు భాషకు హాని చేస్తుందని చెప్పడం నా అభిప్రాయం. తెలుగు బూతులెలా ఉంటాయో తెలుసుకోవాలనుంటే సెట్టి లక్ష్మీ నరసింహంగారి సరసోక్తి యుక్త కృష్ణ శతకను బహిరంగంగా చదవవచ్చో లేదో చదివాక నిర్ణయించండి. అందువల్లే "ఏదో ముతకసామెత చెప్పినట్లు ---" అంటూ బూతుకు సమర్ధన కాని సమర్ధన తెలుగు పలుకుబడిలో ఉంది. ఈ వ్యాసానికి సంబంధించినంతవరకూ సభ్యప్రపంచపు తెలుగు పలుకుబడి సేకరణకు ప్రభోదము మాత్రమే! నా కొడుకు అని తెలుగులో చెప్పక పోయినా పరవాలేదు. మై సన్ అని ఇంగ్లీషులో పరిచయం తప్పులేదు. కాని "నా కొడకా!" అని దీర్ఘం తీసి బూతుగ తెలుగు పలుకుబడిని భ్రష్టు పట్టనీయవద్దు....

జాతియములు తెలుగు భాషకు పుట్టుకతో ఉన్న పలుకుబడి. ఇవి సామెతలలో కనబడతాయి. అందుచేత జాతీయ పదప్రయోగంతో కూడిన సామెతలోని అందచందాలు పరిశీలించాలి తప్ప జాతీయాలను సామెతలుగా పొరపడకూడదు. దేశీయుల వృత్తులు, నాగరికతలు, నమ్మకములు ఆచరణ, అనుభవములు, వ్యవహారములు, చరిత్ర, శాస్త్రము -- సూత్రప్రాయమైన లోకోక్తిలో జాతీయాలు మిళితమై ఉంటాయి.

మానవుడు సంఘజీవి. ఏకాకిగ బ్రతుకలేని మానవుడు, సహజీవనములో అవసరార్థము వృత్తులేర్పరచుకున్నాడు. నాగరికత పెరిగే కొలదీ వృత్తికులాలు ఏర్పడసాగాయి. ఆ కులాలలో ఆచార వ్యవహారాలు ఏర్పడ్డాయి. ఆయా సందర్భాలలో ఎదురయ్యే కష్ట సుఖాలు, ఓదార్పులు కోసం 'పెద్దలమాట చద్దిమూట' అనిపించే ఆదర్శపురుషుల ప్రబోధాలు పసిడి పలుకులై సామెతలుగా ప్రవేశించాయి. సంఘాన్ని ఒకే త్రాటి మీద నడపడానికి ఏర్పడిన ఆదర్శ ప్రవర్తనకు హెచ్చరిక సూచించే సూత్రబద్ద వాక్యం సామెత.

వైద్యుడు లేని ఊరు ఉండదు. కాని చీటికీ మాటికీ వైద్యుడు వద్దకు పరుగెత్తలేని అనుభవ వైద్యం సంభాషణ సామెతలలో కనిపిస్తుంది. అలాగే ప్రతిమానవుడూ భవిష్యత్తును తెలుసుకోవాలని ఆరాటపడతాడు. శాస్త్రం మాట ఎలా ఉన్నా జ్యోతిష, సాముద్రిక పరిజ్ఞాన పరిభాష అనుభవసార సామెతగ గోచరించి సంభాషణను రక్తి కట్టిస్తుంది. 'ఏ పాటు లేకున్నా సాపాటు తప్పదు' అని రైతు తిండిగింజల ఉత్పత్తిలో ఎదురైన అనుభవ ఆర్యోక్తులను మన పలుకుబడిలో చేర్చాడు. అందుచేత చారిత్రికంగాను, ఆచారపరంగాను, నిత్యసత్యముగాను దృష్టాంతాలు, ఉపమానాలు, పెద్దల సూక్తులు సంభాషణలో చోటుచేసుకుంటాయి. ఆ సంభాషణ ఆకర్షణీయమవడానికి కారణం.. శబ్దాలంకారాలు, అంత్య ప్రాసలు, పదలాలిత్యం అసలైన ఆంధ్ర జాతీయములుగ భావ గాంభీర్యంతో

తొణికిసలాడుతుంటాయి. ఈ సామెతల ప్రయోగం చిన్ననాడే మనలో లీనమై పోవడానికి చక్కటి తెలుగు పలుకుబడి పొడుపు కథల ద్వారా పొందగలిగేవాళ్ళం. 'కిటకిట తలుపులు, కిటారి తలుపులు ఎప్పుడు మూసిన చప్పుడు కావు' --- జవాబు 'కంటి రెప్పలు' లాగ పొడుపు కథలు వంటి ఆటలు నిష్క్రమించడం తెలుగు పలుకుబడికి మూసుకున్న తలుపులయాయి.

సందర్భము వచ్చింది కాబట్టి మన తెలుగుపలుకు బడిని చక్కగా దాచుకున్న పొడుపు కథలు గురించికూడా చెప్పుకుందాం. చక్కటి తెలుగు నుడికారపు సొంపు అలవాటు చేసి బాషా సౌందర్యం పట్ల చిన్ననాడే మనను ఉన్ముఖులను చేయడానికి తయారయినవి పొడుపు కథలు. భాషా సౌందర్య రచనకు కావలసిన ముడిసరుకు పలుకుబడి ఈ పొడుపు కథలలోనే లభిస్తుంది. లయ ధ్వనించేలా పదాలు కూర్చి ప్రశ్న తయారు చేసి జవాబు చెప్పించడంలో సంస్కృతితోబాటు విషయ పరిజ్ఞానాన్ని పొడుపు కథలు అందించాయి. మన తెలుగు పలుకుబడిని సజీవంగా పొడుపు కథలులో నిలిపాయి.

పొడుపు కథలలో భాషా సౌందర్యం కట్టి పడేస్తుంది. స్థూల దృష్టికి అవి అర్థరహితంగా ఉన్నట్లు అనిపిస్తాయి. కాని అర్థవివరణ అవసరం లేకుండానే ఆ భావం మనకు అర్థమైపోతుంది. ఉదాహరణకు మంగళ సూత్రం అర్థం వచ్చే ఈ పొడుపు కథలోని భాషా సౌందర్యం భావమునకందదు. 'ఇంతింతాకు - బ్రహ్మంతాకు - పెద్దలు పెట్టిన పేరంటాకు' వృత్య, అంత్యానుప్రాసతో పేరంటాకు ఇల్లాలి సౌభాగ్యాన్ని కళ్ళముందు కనిపింపచేస్తుంది. ఆకాశాన్ని పరిచయం చేసిన పొడుపు కథ 'ఊరంతకీ ఒకే దుప్పటి'. ఆ ఆకాశంలోని ఇంద్రధనస్సు అంటుంది 'ఏడుగురు అన్నదమ్ములం మేము - విడివిడిగా ఉంటే చెప్పగలవు - కలిసి ఉంటే చెప్పలేవు'. ఊహా ప్రపంచ కవితాత్మభావ పలుకుబడి పొడుపు కథలలో ఉంది. తాటి పండును గురించిన ఈ వర్ణన చూడండి 'ఇక్కడి నుంచి చూస్తే ఇనుము - దగ్గరకు పోతే గుండు - పట్టి చూస్తే పండు - తింటే తీయగుండు ' రచనా శైలిని అందించగల పొడుపు కథ' ఇంట్లో కలి వాకలి - ఊళ్ళోకలి చాకలి - వీధిలో కలి రోకలి - ఒంట్లో కలి ఆకలి - ఇలా తెలుగుపలుకుబడి క్రీడా మాధుర్యం గుర్తు చేసుకునే దుస్థితి భవిష్యత్తరాల తెలుగు పిల్లలకు కలగకూడదు.

# తెలుగు పలుకుబడి

## డా.జొన్నలగడ్డ మార్కండేయులు



## 4

**తెలుగు** సామెతలని సౌలభ్యం కోసం ఇలా వర్గీకరించవచ్చు.

1.సహజీవనం గడుపుతున్న జంతువులతో పోలికలు

2.నీతులు, ఆచారములు, కథలు

3.కష్టసుఖాలు, ఓదార్పులు సూచించేవి

4.మానవ ప్రవర్తనకు మార్గదర్శకములు

5.కుటుంబసంబంధాలు

6.సంఘకట్టుబాటు

7.శాస్త్ర సంబంధాలు

8.పురాణేతిహాసాలు.

ధ్వని ప్రధానమైన తెలుగు పలుకుబడి, ఛందస్సు, అలంకారముల అందచందాలు అచ్చమైన తెలుగు సంభాషణకు మనం దగ్గర కావలసిన అవసరం కోసం ఎన్నుకోవడం జరిగింది. ఈ వర్గీకరణ తెలుగుపలుకుబడి సేకరించి ప్రోత్సహించే వారికి ప్రేరణకావాలి అని నా కోరిక. సామెతలను ఈ విధంగానే వర్గీకరించాలన్న నియమంలేదు.

మనతో సహజీవనం గడుపుతున్న జంతు, పక్షిజాలము మన జాతీయ పలుకుబడిలో తొంగి చూస్తున్నాయి. ఉదయం లేవగానే కళ్ళాపుజల్లి, ముగ్గులు పెట్టే సంస్కృతికి తొలిపూజ సాధుజంతువు గోమాతదే! అందుచేత బ్రాహ్మణునితో జతకట్టి 'గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తు నిత్యం' అనే ఆరోగ్యక్తిగ గోమాత తల్లి స్థానాన్ని పొందింది. బ్రాహ్మణులు నెత్తిమీదుంచుకున్న జుట్టు 'గోష్పదము' పలుకుబడిగ నిలిచింది. సాధుపురుషులకు ఉపమానం గంగిగోవుగ జాతీయ ఉపమానమై మంచి వాళ్ళకు గుర్తింపుగ వాడుక

పదమయింది. 'గోపాలనమె గాయత్రీమంత్రతుల్య'మనిపించుకుంది. గృహప్రవేశము వంటి శుభకార్యంగాను, పరలోక వైతరిణిని దాటించే అంత్యక్రియాచారంగాను 'గోదానం' మాటలలోనే కాదు చేతలలోకూడ సజీవం.

ఆశ వదులుకుని చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడే రోగికి ఆశపడే వారి కోరికకు సంచికట్టు వైద్యులు ఆఖరి ప్రయత్నం చేస్తారు. అలా సంచికట్టు వైద్యం చేసే వైద్యుడి ఆశ ఇలా ఉంటుందంటాము 'అటయితే వైద్య కట్నం, ఇటయితే గోదానం'. వెటకారమైనా గోదానం మాట నిలిచిన మన పలుకుబడి గోవు చుట్టూ సంభాషణలను అల్లింది. 'ఏ గోవూ లేని ఊళ్ళో గొడ్డు గేదె శ్రీ మహాలక్ష్మి' అని మిడిసిపడే అల్పుడిని పరిహసిస్తాము. వాడు గోతులు తీసే ఆకతాయి అయితే 'గోముఖ వ్యాఘ్రం' అని బిరుదునిచ్చాం. ఒట్టి గొడ్డుకు అరుపులెక్కువ--అని అంతటి ఆవును గొడ్డు అని ఈసడించినా 'మంచి మనిషికి ఒకమాట, మంచిగొడ్డు కొక దెబ్బ అని గొడ్డుతో పోల్చి చురకవేయడం మన అలవాటు. గోవును, చంపినా, బ్రాహ్మణుడిని చంపినా వచ్చేపాపాన్ని ముడిపెట్టి విసుక్కున్న ఈ పలుకుబడి చూడండి 'ఎగదీస్తే బ్రహ్మహత్య -దిగదీస్తే గోహత్య' అంటూ తప్పా ఒప్పా అనే సంకట పరిస్థితి ఎదురైన సందర్భంలో ఆత్మ విమర్శగ ఈ పలుకుబడి 'To be or not to be' అనే ఇంగ్లీషు సంప్రదాయం ముందు కనుమరుగయింది. ఆవులకు సాధుత్వం, బ్రాహ్మణులకు పేదరికం ఉండవు. అయినా "చెడిపోయిన బ్రాహ్మడికి చచ్చిపోయిన ఆవును దానం చేసినట్లు" ఆవు, బ్రాహ్మణుడు విశిష్టతను చాటుతూనే అరచేతి ఆరో వ్రేలులా సంప్రదాయానికి అలంకార ప్రాయంగా సంస్కృతిలో మిగిలిపోయే రోజు వస్తే పలుకుబడి గోవిందునితో మొరపెట్టుకోవలసిందే!

"అయితంపూడి ఉద్యోగం అయితే గియితే --ఆరావులపాడి చేస్తే గీస్తే -- పెరుగూ, పాలూ మీ వారికి పోస్తావా ?" పదాలలో రెండవ పదము గికారప్రయోగంలో అందం చిందించగల తెలుగు పలుకుబడి ఉంది. రావణుడు గీవణుడులాగ రెండవ పదానికర్థముండదు. మాయాబజారు సినిమాలో తల్పం, గిల్పం వంటి పద సృష్టి నేటి తరానికి కూడా ఆహ్లాదం కలిగించగలిగిందంటే సామెతలలో మన తెలుగుభాషకు ఎంత అందాన్నివ్వగలదో సామెతలుపయోగించి మాట్లాడేవారికి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అమ్మల ముద్దుల నేమన్నారే ! -- అప్పుడు కాచిన నెయ్యన్నారే! - చిన్నపిల్లను ముద్దు చేస్తూ కథ చెప్పి చెప్పినవాళ్ళకు పాడావు (పాలిచ్చే ఆవు) - - విన్నవాళ్ళకు చూడావు (ఈనబోయే ఆవు) అంత్యప్రాసతో ఒకప్పటి గోసంపదను మన కళ్ళముందుంచడానికైనా తెలుగుపలుకుబడి సేకరించాలి.

గంగిగోవు, గోముఖ వ్యాఘ్రం మానవస్వభావానికి మంచి ఉపమానాలు. మరి ఎద్దు? అది పాటుపడే స్వభావానికి మంచి ఉపమానం. ఎద్దులా పని చేస్తాడు అని మెచ్చుకునే మనం 'చదువులేని మొద్దు - కదలలేని ఎద్దు'ను జంట కలిపాము. ఒక మూర్ఖుడిని హేళన చేయడానికి అర్ధవంతమైన 'గి' కారంతో పలుకుబడి చూడండి "ఎద్దురా 'మొద్దూ' అంటే నా మటుకు 'గిద్దె'డేనా ఇవ్వదా" అని పాలుపిండడానికి సిద్ధపడిన మూర్ఖత్వానికి ఇంతకన్న మంచి చురక లేదు! మొదలు పైకెత్తి కాడికి కట్టిన నాగలిని 'కోటేరు' అంటారు. కోటేరులాంటి ముక్కు అంటూ సినీ కవి పోలిక మన తెలుగు పలుకుబడిని ప్రసిద్ధంగా చాటుతోంది. ఎద్దువేరు. దున్నపోతు వేరు. రెంటినీ కాడికట్టి కోటేరుతో పొలందున్నే దుస్థితి హాస్యానికి తావిస్తుంది. ఎద్దు ఎండలోకి, దున్నపోతు నీడలోకి కాడి లాగుతాయి. పనిచేసేవాడిని చెడగొట్టే సోమరిపోతుతో జతకలిస్తే అంటూ ఈ మాటతోబాటు దున్నపోతుమీద వాన అంటూ వెక్కిరించే పలుకుబడి నేటికీ సజీవంగా ఉంది.

కష్టపడే ఎద్దును బాగా మేపాలి. అందుకే 'ఎద్దుతిండి' అనే మాటవచ్చింది. పనీపాటా లేనివాళ్ళది ఎద్దు తిండే మరి. గుడ్డిగా తినడం తప్ప దానికి రుచి తెలియదు. ఎద్దుకేమి తెలుసు అటుకుల రుచి అన్నారు. చేనులోకి తోలినా ఏదో మేస్తూ పోవడమే తప్ప ధ్యాస ఉండదు.! అందుకే గుడ్డెద్దు చేలో పడింది అంటారు. ఎవరినీ సంప్రదించకుండా పని పూర్తిచేయడమే ప్రధానంగా పెట్టుకున్నవాడికి

తెలుగువారు అంటించే చురక ఇది. దున్నే ఎద్దుకే దెబ్బలు అంటూ కష్టపడి పనిచేసేవారికి ఎద్దు ఉపమానమయింది. దుక్కిటెద్దు దేశాంతరం వెళ్ళింది అందుకే!

ఎద్దు యొక్క మొదటి రూపం ఆబోతు. ఆంబోతని వ్యావహారికం. ఎద్దునే అచ్చోసి వదిలితే ఆబోతవుతుంది. ఇది వెంకటేశ్వర స్వామితో సమానం. ఇంటిముందు ఆగితే శుభం. పూజించి బియ్యం మొదలైనవి చేటలో పోసి తినిపించేవారు. పంటచేలో పడి మేసినా "బసవన్నా! బయటకురా" అని దండం పెట్టికొట్టకుండ పూజించిన రోజులు నేడూ అతిశయోక్తిగా కనిపిస్తాయి. శివుడు గజాసురుని హృదయంలో చిక్కుపడిపోయినపుడు నందీశ్వరుడు ఎద్దు రూపంలో విష్ణువు ఆడించగా గంగిరెద్దు అయ్యాడంటారు. "డూడూ బసవన్నా" అనగానే తలాడించే సంక్రాంతి గంగిరెద్దు ఆట చూడని, తెలియని తెలుగువాడు ఉండడు. "గంగిరెద్దులాగ తలూపకు" అని ఆలోచించి పనిచేయనివారిని హెచ్చరించే తెలుగుపలుకు మన సంస్కృతి తరతరాలౌ అందుతూనే ఉండాలి. మంచి వృషభ జాతిని సంరంక్షించుకునే ఆశయంతో కోడెదూడను అచ్చోసి వదిలేవారు. నేడు కృత్రిమ వీర్య సంరక్షణ కేంద్రాలు ఈ అవసరాన్ని నీరుగార్చాయి. ఎదకొచ్చిన ఆవుల వెంటబడే ఆబోతుల అవసర కాలం చెల్లింది. ఆముదాల చేలో ఆబోతు విపరీతంగా ప్రవర్తిస్తుంది. అందుచేత ఆడపిల్లల వెంటబడుతూ వేధించే యువకులు ఆముదాల చేలో అచ్చోసిన ఆబోతుల అవసర కాలం చెల్లింది. అయినా ఆముదాల చేలో ఆబోతు విపరీతంగా ప్రవర్తిస్తుంది. అందుచేత ఆడపిల్లల వెంటబడుతూ వేధించే యువకులు ఆముదాల చేలో అచ్చోసిన ఆబోతుల రూపంగ జాతీయ పలుకుబడిలో నిందింపబడుతున్నారు. గతకాలపు 'ఆబోతు' - ప్రాముఖ్యంతోబాటు, విచ్చలవిడితనం కలిగినేటి యువకుల విచ్చలవిడితనాన్ని హేళన చేసే తెలుగుపలుకుబడి అయింది. అల్లుడితో జతకలిపింది. "అత్తవారింట్లో అల్లుణ్ణి చూడాలి -- ఆముదాల చేలో ఆబోతుని చూడాలి"

ఎద్దు తరువాత 'గాడిద' పదం తెలుగు పలుకు బడిలో కేవలం హేళనకు నిలిచింది. గాడిద 'చాకిరీ' అని మన అవస్థను దానితో పోల్చుకుంటున్నాము. గాడిదది దురదృష్టం. తెలుగు పలుకుబడి అదృష్టం. ఏదో సమయంలో గాడిదగుడ్డు అని అనకుండా ఉండని తెలుగువాడుండడు. దీని మూలపదం 'గాడిదగుడ్డు - కంకరపాసు'. ఆంగ్లేయులు వర్తకానికి దిగిన తొలిరోజులలో మతప్రచారం చేశారు. ప్రార్థన సమావేశంలో 'God the good conquer the peace' జనం చేత అనిపించారు. పలకబడలేని ఆ ఇంగ్లీషు పలుకుబడి తెలుగు పలుకుగ ఆంధ్ర జనపద పలుకుగ అప్రస్తుత ప్రసంగీకుడికి హెచ్చరిక చేస్తుంది. గాడిద కాళ్ళు మహాపుణ్యవంతమైనవి. శ్రీకృష్ణుని కన్నతండ్రి వసుదేవుడు దాని కాళ్ళు పట్టుకున్నాడు. కాని దాన్ని మనం అసమర్థుడి అధికార దాహానికి, గాడిదకి ముడిపెట్టి 'వసుదేవుడంతటివాడు' అంటు అడ్డమైన గాడిదలకూ గాడిద చాటున సలాం అంటు నిందార్థకంగా గాడిదలేని మాటమాట్లాడని తెలుగువాడు లేడంటే అతిశయోక్తికాదు. 'చూడగా చూడగా గుర్రంగాడిదయిందిట' అని దాన్ని చాకిరీకి ఆహ్వానిస్తూనే కుంటిగాడిదకు జారిందేసాకు' అని తిడతాం. 'రాతరాజ్యం ఏలుతుంటే గ్రహచారం గాడిదలను కాయమందిట!' ఇవన్నీ సామెతలుగా కనిపిస్తున్నా నిందార్థకంగా గాడిదతో పోలిక పెట్టి మందలించి బుద్దిగరిపే పెద్దల తెలుగు పలుకుబడికి ఉదాహరణలుగ నేటికాలానికి గాడిదగుడ్డు కంకరపాసుగ మిగిలిపోకుండా ఆర్యుల మందలింపు పలుకుబడిగా అర్థవంతం కావాలి.

# తెలుగు పలుకుబడి



## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

## 5

**గాడిద(గోల)గత్తరను** పక్కకు పెడితే పిల్లికి ఎలుక సాక్ష్యం, పిల్లి మెడలో గంట, పిల్లికి బిచ్చం పెట్టనివాడు - ఇలా పిల్లి, నక్క ఎలుక, కోతి - ఒకటేమిటి, పక్షులు, చెట్లు, ప్రకృతి స్వభావంతో మిళితమై ముడిపడిన మన సంభాషణ తీరు తెలుగు పలుకుబడిలో ఉంది. సంస్కృతన్యాయాలను అనుసరించిన కొన్ని తెలుగు న్యాయాలుగా మారిపోయి పదాలు కొన్ని పలుకుబడిలో చేరిపోయాయి. తెలుగువారి మాట తీరుకు శోభనిస్తున్నాయి. మన తెలుగు పలుకుబడిలో మమేకమయి పోయి సంభాషణలో అలవాటుగా దొరలే సంస్కృత పదాల్ని వేరుగా చూసేకన్న రామ ఠకరండ న్యాయంగా కలుపుకుని పరిశీలిద్దాం. అంటే ఇంగువ పెట్టెలోని ఇంగువ తీసి వేసినా ఇంగువ వాసన మాసిపోనట్లే, సంస్కృత న్యాయం తెలుగు పలుకుబడిలాగే అనిపిస్తుంది. అయితే శిఖి కర్పూర న్యాయంలా అంటే తేజస్సుతో వెలిగే 'అగ్ని, కర్పూరం' జంటగా ప్రజ్వరిల్లి కనుమరుగైనట్లు సంస్కృత, తెలుగు న్యాయాలు కూడా సంభాషణ నుంచి నిష్క్రమిస్తున్నాయి.

ఘోటక బ్రహ్మచర్యం అనేమాట ఉపయోగిస్తుంటాం. గుర్రం బ్రహ్మచర్యం చేయదు. దీనిననుసరించి పిల్లి శీలం, కొంగజపం, నక్క వినయం అనే మాటలు అసత్య శీలవంతుని వర్ణనకు ఉపయోగపడుతున్నాయి. 'కాలుగాలిన పిల్లి' అసహనంగా తిరిగేవాడు. 'కుందేటి కొమ్ము' అపూర్వ వస్తువును ఆశించేవాడికి చురకగా చెప్పినపుడు ఉపయోగిస్తారు. 'హస్తిమశకాంతరం' - దోమ, ఏనుగు అవయవాలలో పోలిక కలిగి ఉన్నాయి. దోమకు రెక్కలు కూడా ఉన్నాయి. కాని ఆకారంలో రెంటికీ పోలిక లేదు. అందుచేత అల్పుడు దోమ, ఉన్నతుడు ఏనుగు అన్న సందర్భంలో ఈ సంస్కృత న్యాయం తెలుగు పలుకుబడిలో చేరిపోయింది. ఆకలితో అలమటిస్తున్న వానిని ఈనిన పులి అంటాం. ఇది అచ్చమైన తెలుగు జాతీయం. ఉన్నంతలో అభిమానం చాటేవాడిది 'ఉడుత భక్తి'. అణిగి మణిగి ఉండేవాడు కోఱ పెరికిన పాము. కప్పదాట్లు వేసేవారు కప్పల తక్కెడలోని కప్పలలా అటూ ఇటూ దూకేవారు కొమ్మలు చూపుతారు.

వారికి కొమ్ములు వచ్చాయంటాము. అలా కొమ్ములు తిరిగిన వారికి వచ్చే అధికారం కోతికి కొబ్బరికాయ దొరకడం వంటిది. అధికారం కోతిపుండు వంటిది. కోతిపుండును మిగిలిన కోతులన్నీ కెలికి పెద్దవి చేస్తాయి. అందుకే కోతిపుండు బ్రహ్మారాక్షసి అనే నానుడి పుట్టింది.

గొర్రెతోక బెత్తెడు. మేకపోతు గాంభీర్యం, మేకవన్నెపులి గప్పాలు కొట్టేవారికి తగిలే తెలుగు చురకలు. ఇచ్చకాలు పలికి అవసరం గడుపుకునేవారిని మూతినాకుడు కుక్కతో పోలుస్తాం. చావు తప్పి బయటపడినవాడు 'పులినాకినవాడు', గొప్ప సాహసవంతుడైతే 'పులి మీసాల'నుయ్యాలూగినవాడు అంటాము. ఇక మృగరాజు స్వభావం మన పలుకుబడిలో పరిసర పరిశీలనా జ్ఞానం ఎప్పుడూ ఉండాలనే సింహావలోకన పలుకుబడిగా గుర్తుకు వస్తూ మానవ స్వభావానికి చురకలు వేయగల జంతు స్వాభావాల పోలికను గుర్తుచేస్తూనే ఉంటుంది. తెలుగు పలుకు 'పులినోటికండ'గ మరుగున పడకూడదు.

'రెక్కలు విరిగిన పక్షి' - రెక్కలు రాని పక్షి - 'రెక్కాడితేగాని డొక్కాడదు' - పక్షులతో పోల్చుకుని మనజీవిత సమర్ధతను, అసమర్ధతను సందర్భోచితంగా సంభాషణ జరుపుతాము. 'గుడ్డొచ్చి పిల్లనెక్కిరించింది' - నెమలి కంటనీరు వేటగానికి జాలికలిగించదు - 'నెమలి కూసినట్లు పిగిలి కూస్తే పేగులు బయటకు వచ్చి చచ్చినట్లు' - నూరుగొడ్లు తిన్న రాబందు ఒక గాలి పెట్టుకు సరి' - నూరుకాకులలో ఒక కోయిల ఏమీ చేయలేదు' - అంటూ సమయం సందర్భం వచ్చినపుడు పక్షులను పోలిక పెట్టడం మన తెలుగు పలుకుబడిలో చక్కదనం నింపుతాయి.

చిలకపలుకులు జ్ఞానం లేని అనుకరణ. అందుకే చిలుక చదువు పరిమిత జ్ఞానానికి ఉదాహరణ పదమైంది. భయపడిన జంతువు, లేదా పక్షి తోక ముడుస్తుంది. మనకు తోక లేకపోయిన అవమానపడినపుడు తోకముడవవలసిందే పిచ్చుకపై బ్రహ్మాస్త్రం మన చేతకానితనం. కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడవి అతిశయోక్తులుగా కనిపించినా కాకిగోల మాత్రం భరించలేనిది. అయినా ఏకాకిగా బ్రతకడం మనకిష్టముండదు. అందుకే పనిలేకపోయినా కాకి దంత పరీక్ష మొదలెడతాం. కాకిలా కలకాలం బ్రతక కూడదు. హంసలా బ్రతకాలని కాకిని ఈసడిస్తాం. కాకిముక్కుకు దొండపండు మనకు కిట్టదు. వధూవరులు చిలకాగోరింకలలా ఉండాలి. ఇలా వరహీనానికి, అనురాగానికి పోలికలు పెట్టి పరిశీలనలో మనతో సహజీవనం జరిపే పశుపక్ష్యాదులను పలుకుబడిలో తెలుగు సమాజం నిలుపుకుంది.

అసలీ పాడులోకాన్ని కాకులతో పోల్చిన సంఘజీవనం మనది. 'లోకులు కాకులు' అన్నారు. లోకంలో ప్రతిమనిషి కోడిగుడ్డంత బంగారమేనా సంపాదించాలి. లేకపోతే లోకం కోడై కూస్తుంది. కోడి కూతతోనే మేల్కొంటోంది. 'లోకం కోడై కూస్తోంది' - అంటే మన ప్రవర్తన వింతగానో, విపరీతంగానో ఉందన్నమాట! కాకిపిల్ల కాకికి ముద్దు. కాకి, కోకిల ఒకే గూటిలో పెరిగినా కాకిస్వరం కోకిలను అనుసరించదు. కాకి ఒక ప్రక్కకే చూస్తుంది. అలా చూసేవాడిని కాకాక్షి అన్నాం. కంపలో బడ్డ కాకి అవస్థ మన సంకట స్థితికి ఉదాహరణగా నిలుస్తుంది.

ఇలా తన పరిశీలనలోని పశుపక్ష్యాదులనుంచి గడించిన అనుభవ విజ్ఞానాన్ని తెలుగుపలుకుబడిలో చిన్నమాటలలో కుదించి తేటతెలుగు దేశభాషలలో ప్రత్యేకతను నిలుపుకుంది. మరికొన్ని పోలికలతో మన స్వభావానికి అద్దం పట్టిన పదాలు చూద్దాం. అతి తెలివి ప్రదర్శకుడిని 'గుంట నక్క'అంటాం. వాడు వయసు మీరిన వాడైతే 'వృద్ధజంబుకం' అంటాం. మరి వాడు అదృష్టవంతుడైతే 'నక్కను త్రొకినట్లే!' నక్కవినయం' ఎలా ఉంటుందో ఆపద ప్రయోగం చేసేవారికి వివరించనక్కరలేదు. వాడు పిల్లిమీద ఎలుకని, ఎలుకమీద పిల్లిని ఎక్కించగల 'అడ్డగాడిద'. అడ్డగోడమీద పిల్లి' - ఎటు దూకుతాడో తెలియదు. వాడు తెచ్చేది 'కోడిగుడ్డు తంటసం'. కూపస్థమండూకం'లా జీవించేవాడు వీపు మీద గంధపు చెక్కలున్నా వాసన గ్రహించలేని మూర్ఖుడు. లేని 'కుందేటి కొమ్ముకోసం' వెదుకుతూ కూసేగాడిదొచ్చి మేసే గాడిదను చెరిపే రకం. ఆవు ఉండగా గాడిద పాలు పితికే రకం.

ఉపకారం చేసి నిష్కారణ ఆపదలో చిక్కుకోవడం 'గౌతముని గోవు'లాంటిది. మాయగోవును చంపిన గౌతముడు ఆ పాపవిముక్తికి గోదావరిని తీసుకువచ్చాడు. దోమ ఎంత ప్రమాదమో, ఈగకూడా అంతే. ఒక్క ఈగ కడుపులోకి వెళితే తిన్నదంతా కక్కిస్తుంది. ఉన్నదున్నట్లు ప్రతినకలు రాయడం మక్కికి మక్కి. ఏనుగు తిన్న వెలగపండులోని గుజ్జులా సంపదలు అన్నీ హరించుకుపోతాయి. తెలుగులో సింహస్వప్నం అనేది భయంతో శాంతిలేనపుడు మాట్లాడతాం. సింహం కలలోకి వస్తుందన్న భయంతో ఏనుగు సగం కళ్ళు తెరిచి నిద్రపోతుంది. అందుకే ఏనుగు నిద్ర అనే పదం పుట్టింది. ఏనుగు పాడి అన్నమాట సమృద్ధిగా పాడి ఉన్నవారి పట్ల ఉపయోగిస్తారు. పందిలా పదిమంది పిల్లలని కనే కన్న ఏనుగు పిల్ల ఒకటి చాలు అంటారు.

మహిమ తెలిసి మనం గంగా స్నానం చేస్తున్నాం. కాకి తెలియకుండా గంగాస్నానం చేస్తుంది. ఎవరు పుణ్యాత్ములు అనే 'మిడిమిడి' జ్ఞాన చర్చ గురించి అనవసరం. చాణుక్యుడు లేగదూడ వేల ఆవుల్లో ఉన్న తల్లి ఆవును ఎలా గుర్తిస్తుందో పాపం మనం ఎక్కడున్నా వెంటబడి తగులుకుంటుంది అని చెప్పాడు.. 'సూక్ష్మంలో మోక్షం' అన్నట్లు సహజభావాలు, దృష్టాంతాలు, పదలాలిత్యం భావగాంభీర్యము వినడానికి ఇంపుగా ఉంటాయి. జన సామాన్యం నోటిలో 'రోలు-రోకలి'లా సాగుతాయి. ధ్వన్యనుకరణ పదాలు మనకు పశుపక్షులనుంచి కూడా వచ్చాయి. పక్షి కూత - 'కిచకిచ - కువ - కువ', పంది కూత గురగుర, పురుగు తొలచడం-లుకలుక, ఏనుగు నడక దుడి దుడి, - కోతి 'గిటగిట' పండ్లు నూరుతుంది.

ఈ శబ్ద సౌందర్యం చెవికి హాయి గొలుపుతుంది. ఇందులోని లయ, సంక్షిప్తత సహజంగాను, సరళంగాను, సులభతరంగాను ఉంటాయి. ఈ విధంగా తెలుగు పలుకుబడిలో మనతో సహజీవనం గడుపుతున్న జంతుపక్షి పలుకుల తీరు స్వభావాలు మాటల పొందికలో భావప్రకటనకు సహాయపడుతున్నాయి. ఇవి చక్కగా ఉల్లేఖించి చెప్పినపుడు - వాటిలో కనిపించే వికారం, వైపరీత్యం, వైషమ్యం, అతివాస్తవికత, అసహజత్వం మొదలైన గుణాలు, ఊహ, తర్కంతో కూడిన భావలహరిని రేపుతాయి. అలాంటి విమర్శనాత్మకంగా సుగుణాన్ని కాని నైచ్య గుణాన్ని కాని సంభాషణ రసికత చతురతతో చేర్చి చురకలంటించగలిగే సుతిమెత్తని గౌరవ మందలింపుల పలకరింపులకు తెలుగువారు దూరం కాకూడదు.

# తెలుగు పలుకుబడి

## డా.జొన్నలగడ్డ మార్కండేయులు



## 6

**సామెతలు కవిత్వమునకు** ఆరంభ దశ అని కూడా అన్నారు.. యతి ప్రాసలు, భావగాంభీర్యం కలిగిన ఈ అనుభవసారం సంప్రదాయ, జానపద కవుల రచనలలో చోటు చేసుకున్నాయి. వ్యాఖ్యానం అవసరంలేకుండానే అవి ఒకరి నుంచి మరొకరు అందుకుంటున్నారు. తెలుగువారి మాటల పొందిక, తీయతనాన్ని మందలింపులలో కుదించి అందుకుంటూ సమాజం రచయితలకు చక్కటి సంభాషణా పలుకుబడిని అందిస్తున్నాయి. శైల్ని అందిస్తున్నాయి.ఎ^ఎన సమాజంలో కులాలు, మతాలు, భిన్నత్వంలో ఏకత్వంతో అనేక తెగలుగా విడిపోయి ఉండవచ్చు. ఈ భిన్నత్వంలో సమాజ కట్టుబడి జీవన విధానం తెలుగు సంభాషణా పలుకుబడిలో ఇమిడిపోయింది. మతం, కులం, జాతితో బాటు లోభులు, దాతలు, ఉన్నత పురుషులు, నీచులు, చండికలాంటి ఆడవాళ్ళు పత్రివతలు, వేశ్యలు, విటులు... సమాజంలోని ప్రతికోణం మన సంభాషణలో చోటు చేసుకుంటోంది.

అనువు కానిచోట అధికులమన రాదని ఈ సమాజం మనల్ని ఆలోచింపచేసింది. స్త్రీ కేశముండన దురాచారాన్ని ఖండించి "తలలు బోడులైన తలపులు బోడులు కావని" సానుభూతిని వ్యక్తం చేస్తూనే బౌద్ధమతంలో చేరి భిక్షించు స్త్రీ సన్యాసినిలకు, బోడి సన్యాస పుంగవులకు కూడ ఇది హెచ్చరికగా నిలిచింది.`లోకులు కాకులు` కుండవలె మూయ మూకుడుండదని మన ప్రవర్తన వింతగా ఉండకుండా చూసుకోమన్న మందలింపు పలుకుబడి తెలుగు భాషకు సజీవంగా ఉండాలని కోరుకుందాం.

తానే తుమ్మి తానే శతాయుష్షు అనుక్కూడదు. తాటి చెట్టుక్రింద పాలు త్రాగినా కల్లు త్రాగాడంటారు. కాబట్టి అన్నీ తెలిసినవాడూ.. ఏదీ తెలియనివాడూ లేడు. అన్నీ ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుంది. ఏమీలేని ఆకు ఎగిరెగిరి పడుతుంది. కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువట! అంటే ఎంత గొప్పవాడైనా ఈ సమాజంలో ఒక మనిషే. ఎంత బంగారపు పళ్ళెమైనా గోడ చేరుపు కావాలి. హద్దు మీరితే నిరసిస్తాం. బంగారపు చెప్పుని మెడలో ధరించం. వాటిస్థానం కాళ్ళది. ఒకవేళ పాలకావిడిలో సమతూకం కోసం

రెండో చట్టిలో రాయిని భరించినట్లే గొప్పవాడిని భరించవలసి వస్తే పైకి గౌరవించినా ఉట్టిదే అవుతుంది. ఎందుకంటే కడుపులో లేనిది కౌగలించుకుంటేరాదు, కాబట్టి  కత్తిమీది సాము కానివారికైనా వద్దు. కత్తిపీట పెట్టి కాలు కోసుకుంటానంటే వాడి ఖర్మ. వాడిని వదిలేయండి.

ఎవరో మనల్నేదో అనడం మాట దేవుడెరుగు. మనవాడే ఎదుటి పక్షంలో దూరి మనల్ని హేళన చేస్తే... వాళ్ళను గొడ్డలికామతో పోల్చాం. కామను కొన్ని చోట్ల కుసి అంటారు. చెట్టుకొమ్మను కుసిగా తయారు చేసి గొడ్డలికున్న రంధ్రంలో బిగించి చెట్లు నరుకుతారు. కుసివెళ్ళి గొడ్డలి ముడ్డిలో దూరితే మనవాడే మనల్ని తెగనరుకుతాడు అని చెట్లు అనుకోవలసిన మాట వాటికి నోరు లేదు కాబట్టి మన పలుకుబడితో బంధు ద్రోహం చేసేవాడిని తిట్టడానికి మనం ఉపయోగిస్తున్నాం. ఒకసారి ఒక కమ్మరి కుసిలేని గొడ్డళ్ళు తయారైనవి పుచ్చుకుని అడవి మార్గంలో వస్తున్నాడు. వాడిని చూసి చెట్లు గజగజ వణికాయి. అప్పుడొక ముసలి చెట్టు భయపడకండి మనవాడు అక్కడలేడు (కుసిగా చేయబడిన కొమ్మ) అందిట. అందుకే మనవాడు మనకే ద్రోహం చేసే వారికి హెచ్చరికగా చేనుకుగట్టు, ఇంటికి గుట్టు మంచిది అని నిర్ధారించాము. చేనుకు గట్టు వేసుకుంటే పశువులు చొరబడవు. ఇంటి గుట్టు రట్టు చేసేవారిని గుర్తించి జాగ్రత్తపడాలి.

మనవాడు మనకు దూరమై ఎదుటి పక్షంలో చేరినా ఇలా అనుకుంటాం. కండ్లకు దూరమైనా చెవులకు దూరం కాలేదని. ఎందుకంటె కందకులేని దురద కత్తిపీటకన్నట్లు చేరదీసినవాడు గురివిందగింజ తన నలుపెరుగదన్నట్లు వాడు చేసిన నీచపు పని వాడికి అర్థమవదు అని మనచేత ఛీ అనిపించుకుంటాడు. అందుచేత ఎంత చెట్టుకంతేగాలి. కట్టె వంకర పొయ్యి తీరుస్తుంది.

అయినా మానకుండా ఇంకా చేసే గుసగుస యోచనలు గుడిసెలు కూల్చడానికి పనికొస్తాయి. అలాంటివాడిని నాలిముచ్చు నట్టింట ఉండరాదని తీర్మానించారు. బావిలోతు చూడగలంకాని మనసులోతు చూడలేముకదా అందుకని. నాలిముచ్చుగాడి వెర్రి, పైత్యం వేయి విధాలు. ఎంత సంస్కరించామనుకున్నా వాడు చెప్పేవి శుష్కప్రియాలు - శూన్యహస్తాలు. అందుకే పుట్టుపూర్వోత్తరాలెరిగి పొత్తు చేయాలి. అలా జరగని నాడు ప్రపంచాన్ని లెక్కచేయకుండా నీ పని నువ్వు చేసుకో అన్నది తరతరాల తెలుగు పలుకుబడి.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. 'ఎవరివల్ల చెడ్డావోయీ వీరన్నా అంటే నోటివల్ల చెడ్డానోయీ కాటమరాజు' అనడం తెలుగువారి నిట్టూర్పు. ఎందుకంటే నోట్లో నువ్వుగింజ నానదు. నోరుకొవ్వెక్కి మాటజారి కష్టాలు తెచ్చుకుంటాం. అయినా నోరుంటే తలకాచుకోవచ్చు. నువ్వుగింజకాదు ఆ నోట్లో ఒక్క అక్షరం కోటి వరహా విలువచేస్తుంది. చదువుతో సంస్కారం వస్తుందన్న ధ్వని ఈ వరహాల తెలుగుమాట.

నిదానమే ప్రధానం అనే హెచ్చరిక చాలామందికి నచ్చదు. అలాంటివాళ్ళల్లో చైతన్యం కలిగించడం కష్టం. ఎంత చెపితే మాత్రమేమిటి? నిలకడలేకపోయిన తరువాత.. అవి నీళ్ళ మూటలే! 'నిద్రపోతుంటే లేపవచ్చుగాని మెలుకువగా ఉన్నవాడిని లేపడం ' మనతరం కాదు. గొడ్డెకు తోక బెత్తెడేకదా!

తీగెకు కాయ బరువా? అలాగే తల్లికి పిల్ల భారమవుతుందా? అయితే మాత్రం పిల్లలు గారాం చేస్తే పాడయ్యే అవకాశం ఉందని అందరూ ఒప్పుకోవాలి. 'కాకిపిల్ల కాకికి ముద్దు' కాబట్టి తల్లి తన బిడ్డ తప్పిదాన్ని ఎదుటి పిల్లవాడి మీదకి త్రోసే ప్రయత్నంలో పిచ్చిప్రేమ చూపకూడదు. అలా అని ఉక్రోషపడి గారాబం గజ్జెలకేడిస్తే వీపు దెబ్బల కేడ్చిందని చేతివాటం రుచి చూపడం కూడా అన్నివేళలా మంచిది కాదు.

తన కలిమి ఇంద్రభోగం. తనలేమి లోక దారిద్ర్యం అని చింతించవద్దన్నది తెలుగు పలుకుబడి. ఓడలు బండ్లగును. బండ్లు ఓడలగును. నవ్వే ఊళ్ళు పట్టణాలవుతాయి. అందుచేత ధనవంతుడికైనా పేదవాడికైనా నొసటి వ్రాలు తప్పదు. నొసటి వ్రాలుకు నూరేండ్లు చింతించినా ఏమీ చేయలేము. అందుచేత 'నడమంత్రపుసిరి' అనే మాట పుట్టింది. నడమంతరాన సిరి వచ్చినా నరాల మీద పుండు

వచ్చినా చెప్పశక్యం కాని సలుపుట! అలాంటివారు జరిగినంత మట్టుకు జయభేరి మ్రోగిస్తారు. జరగకపోతే రణమేననే ఈ నానుడి తరతరాలుగా అందుకుంటూనే ఉన్నాం. నైజ గుణానికి గుడ్డికంటికి మందులేదు.

ఒక్కొక్కరాయి తీస్తుంటే కొండయినా తరుగుతుంది. కూర్చుని తింటే కొండలయినా కరిగిపోతాయి. ముందు కాలానికి పొదుపు అవసరం గురించిన బంగారు మాట చెపుతున్నారో లేదో తెలియదు కాని కలలలో విహరించేవారిని గురించిన తెలుగు పలుకుబడి హృద్యంగమముగా ఉంటుంది.

కల పసిడికి కాంతి మెండు అన్నది పెద్దలమాట. కలలో కనిపించిన బంగారానికి మెలుకువ వచ్చిం తరువాత కూడ వన్నె చిన్నెలాపాదించుకుని సంబరపడతాం. కాని కలలోని భోగం కలవారింటనే. సామాన్యునికి కలలో కనిపించినది ఇలలో దొరకదు. ఒక్క కలగంటేనే తెలవారుతుందా అని హేళనగా అన్నప్పటికీ ఆలోచింపచేయగలిగిన ఈ తెలుగు పలుకుబడి మరిచిపోలేనిది. అసలు కన్ను మూతబడితే చాలు కల.. అంటుంది ఆర్య సమాజం. కలలు నిజమవుతాయా? కలలో పాలుత్రాగిన పాత్ర కంచుదైతేనేం! కనకపుదైతేనేమిటట? కలనిజమయ్యే కృషికావలిగాని అన్నది మన మాటతీరు.

ఎంత ఇష్టుడైనా దుష్టుడికి దూరంగా ఉండాలి. ఇంటి దీపమని వెలుగిస్తుందని దీపాన్ని ముచ్చటగా గౌరవించి ముద్దుపెట్టుకుంటే మీసాలు కాలతాయి. ఎవరి హద్దులలో వారి నుంచాలి. బంగారు గాలానికి బంగరు చేపలు పడవు. ఇంత మంచి తెలుగు పలుకుబడి మనకుంది అని చెబితే ఉపయోగించేవారు ఎంతమంది? కాబట్టి యదార్థవాది బంధు విరోధి. ఇలా అన్నా తప్పే అవుతుంది. కాలుజారితే తీసుకోగలంకాని నోరుజారితే తీసుకోవడం కష్టం. మాట నిలుస్తుంది అని మరిచిపోరాదు. మాటలచేత మన్ననలు పొందవచ్చు. మాన్యాలు పొందవచ్చు. మూటలు కొనవచ్చు. మానవులుండరు కాని మాటలు నిలిచిపోతవి. కీలెరిగి వాత పెట్టగలిగిన మాతృభాష పలుకుబడి మరుగున పడిపోకుండ సేకరిద్దాం.

✲ ✲ ✲

# తెలుగు పలుకుబడి



## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

## 7

వ్యంగ్య సంభాషణకు తెలుగు భాష చక్కటి వేదిక. క్షణం చిత్తం, క్షణం మాయ అనే మానసిక ప్రవర్తన మనది. మన జీవితాలను ఒక దారిలో పెట్టి ఉన్నత స్థితి కలిగించిన తల్లిదండ్రులు కాని, ఇతర ముఖ్యులు కాని తిరిగి రాని లోకాలకు వెళ్ళిపోయినపుడు కలిగిన స్మశాన వైరాగ్యం తిండి దగ్గర మాయమయిపోతుంది. లేకపోతే లోకమంతా సన్యాసులే ఉంటారు. అందుకే కాటి దగ్గర మాటలు కూటి దగ్గర ఉండవు. విరక్తుడైనా సన్యాసి అయినా చితి చచ్చినవాడిని చింత బ్రతికున్నవాడిని కాలుస్తుంది. అందుకే మూలుగులు మునుపటిలాగే భోజనమెప్పటిలాగే అని చురకలు వేస్తాం. పచ్చగా ఉంటే పదిమంది చుట్టాలు మరి. ఏ ఎండకా గొడుకు పట్టాలి మరి. దిగులు పడితే వెతలు తీరవు అన్నది వ్యంగ్యం కాదు. జీవిత సత్యం.

పదిమంది చుట్టాలు ఇంట్లో చేరితే వాళ్ళు వెళ్ళేదాకా కొన్ని పనులు వాయిదా వేసుకోక తప్పవు. ఇదే వంకని పనులు ఎగగొట్టేవారు కూడా ఉంటారు. అందుచేత ఆ సమయంలో వ్యంగ్యంగా 'కూసేగాడిదొచ్చి మేసే గాడిదను చెరిచిందట' అనని తెలుగువాడు అరుదు. 'క్షేమంగా వెళ్ళి లాభంగా రా..' అన్న తెలుగు పలుకుబడిలో దీవన కన్న అసాధ్యమైన పనిని సాధించు అన్న ఆశయానికే విలువనివ్వాలి కాని ఇతరుల నిబ్బంది పెట్టే వ్యంగ్యం సాధించకూడదు. పాపభీతికంటే ప్రజాభీతికే వెరవాలి. గొప్ప తెలిసినవారే గోతిలో పడతారు.

మన సామాజిక జీవితంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, ఇంకా ఎన్నో ఉపజాతుల కులాలు గణాంక రీత్యా కూడ పలుకుబడిలో వదిలి పెట్టవు. మానవత ఒక్కటే మన కులం అని నిర్వచించిన మానవ స్వభావం చాలా విచిత్రమైంది. కులవృత్తి ప్రాతిపదికన నువ్వెంత అంటే నువ్వెంత అని బలహీనతలు బయట పెట్టుకుని భుజాలు తడుముకుంటుంది. వ్యంగ్య ప్రధానమైన ఆ పలుకుబడిలో సంస్కరించి తప్పు సవరించుకోమనే హెచ్చరిక మాత్రం తెలుగు పలుకుబడిలో సిగపట్ల గోత్రంగ సజీవంగా ఉంది.

బ్రాహ్మణుడు ఒకప్పుడు సమాజాన్ని శాసించాడు. బ్రాహ్మణుడైన ఆపస్థంభ ధర్మ సూత్రములే అన్ని కులవృత్తులకు నేటికీ శుభా శుభ కర్మలలో అనుసరణీయం. బ్రాహ్మణుని చెయ్యి ఏనుగు తొండం ఊరుకోవట! అంది మన సమాజం. ఏనుగు తొండం కదులుతూనే

ఉంటుంది. అది ఎవరి జోలికి వెళ్ళినంత సేపు మంచిదే! అలాగే బ్రాహ్మణుని చేయి దీవించాలి కాని పరాక్రమం చూపితే అనర్థం తప్పదు. బ్రాహ్మణుడనే బాపడని వికృతిగా పిలుస్తారు. సాత్వికుడు కాబట్టి అతని కొలువు సుఖతరమవుతుంది తప్ప బద్ధకాన్ని పెంచుతుంది. కొలువు అంటే నిన్న మొన్నటివరకు సేద్యపు పని అని అర్థం. బ్రాహ్మణ వ్యవసాయం చేస్తావా పల్లకీ ఎక్కుతావా అంటే కుదుపులుండే పల్లకీ కన్న బాపన వ్యవసాయమే సుఖమన్నాడని వ్యంగ్యంగా అంటారు. బాపన సేద్యం బడుగులు నష్టం - కాపుల చదువు కాసుల నష్టం అని అన్నారు. ఇక్కడ చదువు అంటే నేటి చదువుకాదు. కావ్య శాస్త్ర నాటక అలంకారములు. అవి చదువుకుని రాజులను మెప్పించి అగ్రహారాలు సంపాదించాలి కాని చాతకాని వ్యవసాయం చేయకూడదని హెచ్చరించారు. అగ్రహారాలు సంపాదించగలిగి కూడ సంపాదించకుండా హాలికులైననేమి అన్న పోతన కాని 'బొడ్డుపల్లిని గొడ్డేరి మోసపోతి' అన్న శ్రీనాధుడు కాని వ్యవసాయ ప్రవృత్తికి ఇమడలేకపోయారు. కేవలం ధన సంపాదన ప్రవృత్తితో వ్యవసాయకుల వృత్తికి దూరమవడం బాపన వ్యవసాయమే అవుతుంది.

బ్రాహ్మణుడికి దండంపెట్టి 'దండమయా బాపనయ్యా అంటె 'నీ తండ్రి నాటి పాతబాకీ ఇచ్చిపొమ్మన్నాడట!' బాకీ వసూలు విషయంలో ఇది ఉదార స్వభావం అనిపించుకుంటుందా? అయితే బ్రాహ్మణానా అనేకత్వం అనే మాట ఉంది. ఐకమత్యం మాట ఎలా ఉన్నా అనేక శాఖా భేద వైషమ్యాలు ఇంకా తొలగలేదు అన్నది ఇక్కడ అప్రస్తుతం. అన్ని శాఖలవారు పండితులే! కాని మంత్రిత్వం నెరపి రాచరికపు సౌఖ్యం మరిగిన నియోగి బ్రాహ్మణులకు టెక్కు. పురోహిత సంఘానికి నచ్చదు. కొన్ని బ్రాహ్మణ తెలుగు పలుకు బడులు చూద్దాం. వేదం పూర్తిగా చదివినవాడిని ఘనాంత స్వాధ్యాయి అంటారు. ఘనాపాఠిగ ఆయనకు అడగకుండానే శుభకార్యాలలో సంభావనేకాదు గౌరవం కూడా విశేష స్థాయిలో ఉంటుంది. ఘనాపాఠిగా ప్రకటించుకునేవాడిని డిప్పకాయ అని ఎత్తి పొడుస్తారు. వాడు తన సత్తా నిరూపించుకుంటే ఐసరు బొజ్జా అని అభినందిస్తారు. లేదంటే తృతీయ హస్తం అంటే మొండి చేయి చూపిస్తారు. సభలో మలమూత్ర విసర్జకు బయటకు వెళ్ళవలసి వస్తే దేహబాధ తీర్చుకుని వస్తా అని సంస్కారయుతంగా చెప్పి వెళతారు. దేహబాధ ఇప్పుడు ఏ అర్థానికైనా సరిపోతుంది. వృథా ప్రసంగాన్ని, అభిప్రాయ భేదాలను శషభిషలు అనే పదంలో ఇమిడ్చారు. పాండిత్య విషయంలో వట్టి చవటను శుద్ధబుద్ధావతారం అన్నారు. ఓమ్మని అంకురార్పణ చేసి బ్రతకమన్నారు గాని అపాత్రదానాలు స్వీకరించి కానికూడు తినడం నిషేధం. ఈ వెటకారాన్ని పుల్లవిరుపు మాటలన్నారు. అలా మాట్లాడిన వాడిని పోరా పిల్లకాకి అనేవారు. అలాంటి అసందర్భ ప్రేలాపన లొట్టాభట్టీయముగ అనే మాట నేడు పలుకుబడిలో నిష్క్రమించింది. అర్చకుడు పెట్టే శఠకోపం గుడిలో అవసరమైనా మోసపోయిన సమయంలో పలికే మాటకు పర్యాయ పదమైంది. ద్రావిడ ప్రాణాయామం అనవసరమైన మాట.

పున్నామ నరకం దాటించడానికి కొడుకు కావాలి. కొడుకు లేకపోతే పెంచుకున్న కొడుకు పనికిమాలినవాడైతే దత్తపుత్ర శోకం అంటే తెచ్చి పెట్టుకునే బాధగ అభివర్ణించారు. ధనియాలను చెప్పుతో కొడితేగాని మొలవవని అంటారు. ధనియాల జాతి అని చెప్పినవారి మాట వినని మూర్ఖుల పట్ల ఈ ప్రయోగం నేటికీ ఉంది. బ్రాహ్మణుడు బెడ్డముక్క బ్రాహ్మడి పెళ్ళాం బెల్లం ముక్క అనే మాట బ్రాహ్మణ శబ్దం విలువ తగ్గడాన్ని సూచిస్తుంది. పిల్లపిల్లతరముగ అనే మాట అనాధ బ్రాహ్మణ వంశం గురించిన ప్రస్తావన. దొమ్మరాటకు డోలు నిరంతరంగ అనే మాట అనాధ బ్రాహ్మణ వంశం గురించిన ప్రస్తావన. దొమ్మరాటకు డోలు నిరంతరంగా మోగాలి. శుభకార్యం లో కూడ డోలుతో బాటు సన్నాయి ముహూర్త మయ్యేంతవరకు మోగాలి. కాని మొదలు పెట్టి రాగం తీసేలోపునే ఆపమంటారు. అందుచేత సన్నాయి మేళగాళ్ళు "బ్రాహ్మణుల పెండ్లిలో గట్టిగా వాయించినా దొబ్బే మెల్లిగా వాయించినా దొబ్బే" అని అంటారట! పప్పన్నం బ్రాహ్మణులదే అయినా అన్నిజాతులవారు ఈ మాట ఉపయోగించడం పప్పులో కాలుపెట్టడమే కదూ!

ప్రజా స్వామ్యంలో కూడా రాజకీయ శబ్దం రాజుకున్న ప్రాముఖ్యంను సూచిస్తుంది. నాడు రాజైనా నేడు ప్రజలైనా 'యథా రాజా తథా ప్రజ' అంటూ రాజ శాసనమును అంగీకరిస్తున్నాం. రాజాజ్ఞకు మించిన శాసనం లేదు. రాచకుల వారందరూ రాజులు. రాజ

శబ్దంను తగిలించుకుని నేడు సంఘంలో క్షత్రియ కులముంది. ఆ కులంలోని పరిపాలకులైన ఒకప్పటి తరం ప్రజల పలుకుబడి నేటి క్షత్రియ కులానికి వర్తించదు. అయినా అధికారంగలవారికి ఇవి అన్వయింపబడతాయేమో పలుకుబడిని గుర్తించి నిర్ణయించుకోవాలి.

రాజులకు కన్నులలోను, పాములకు కోరలలోను విషముంటుంది. అలాంటి రాజులతో చెలిమి త్రాచుపాముతో చెలిమిగా అభివర్ణించారు. రాజు తలిస్తే దెబ్బలకు కొదవలేదు. అందుకే రాజు కూతురైనా భర్తమాటకు తల ఒగ్గాలి. అందుకే రాజు కూతురైనా తానొకరికి ఆలినన్న సంగతిని గుర్తుకు తెచ్చింది సమాజం. అలాగే రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి పోల్చిమొత్తవద్దని చురక వేసింది. రాజు మెచ్చినది మాట మగడు మెచ్చింది రంభ అన్నది తెలుగు పలుకుబడి. రాజుల సొమ్ము రాళ్ళపాలు వేశ్యలపాలు అన్నది నిష్క్రమించవలసిన పలుకుబడిని ప్రజాస్వామ్య పాలకులు సజీవంగా నిలిపితే మాత్రం దురదృష్టమేనని చెప్పవలసి వస్తుంది. రాచరికం ప్రజల చేతిలో ఉంది. రాజ ధర్మంను దుర్వినియోగ పరచినా లేక ప్రశంసించినా గతకాలపు రాచరిక వ్యవస్థ ధర్మపాలనకు ఆమోదయోగ్యమైన పలుకుబడి తప్పక సేకరింపబడాలి.

బ్రాహ్మణుల తరువాత వైశ్యులు తెలుగునాట వీరిని కోమట్లు అంటారు. బ్రాహ్మణుని మీద సంధ్య, కోమటి మీది అప్పు నిలవవు అన్నది తెలుగు పలుకుబడిలో వైశ్యునికి ప్రశంస. ఇంకా ఎన్నో కులాలు ఉన్నాయి. ఏ కులంవారైనా ఆయా కులముల వారు ముందుకు వచ్చి తెలుగు పలుకుబడిలోని తమ పదజాలాన్ని అందివ్వాలి తప్ప సేకరించిన వారిపై అపోహ పడే ప్రమాదానికి తెరతీయకూడదు. కులముకు కులము తెగులు, నీళ్ళకు నాచు తెగులు అని తెలుగు పలుకుబడి హెచ్చరించింది. పండించే రైతుకు అన్నం కరువుండకూడదు. కుమ్మరావములో ఇత్తడిముంత దొరకదు. కుమ్మరివానికి కుండ, సాలెవానికి గుడ్డ, మాదిగవానికి చెప్పుకరువు అనే నిత్య సత్యాలతో బాటు కులవృత్తులలో దాగి ఉన్న సాధక బాధకాలు తెలుగు పలుకుబడిని సుసంపన్నం చేస్తాయి. కుండలు చెయ్యడానికి కుమ్మరికి ఒక ఏడు పట్టినా గుదియకు ఒక పెట్టు చాలని ఏదైనా పాడుపని చేసేవారిని చేసే హేళనలోను, కుమ్మరి వీధిలో కుండలమ్మినట్లు అని ఇలా కులాల గురించిన ప్రస్తావనలో ఎన్నో పలుకుబడులు సేకరింపబడాలి. 'కులమెరిగి చుట్టమును చేరదియ్యాలి, స్థలమెరిగి వాసం చేయాలి' అనేది నేడు కూడ సజీవం కాబట్టి ఈ సేకరణ అంత సులువు కాదు. నీతులు గరపుటకు, కుటుంబ అనుభవములు తెలుపు మానవ జీవిత ఛాయలు కలిగిన తెలుగు పలుకుబడి అన్నికులాల పెద్దల అనుభవముగా దాచుకోవాలన్నదే నా అభిలాష. ఎవర్ని ఎవరూ కించపరచుకునే ప్రయత్నం తెలుగు పలుకుబడిలో జరగలేదు.




## 8

‘**కులముకు కులము** తెగులు నీళ్ళకు నాచు తెగులు‘ అంటారు. అందుచేత ‘తవ్వెడు బియ్యానికి పొంగెక్కువ‘ అని కులము జోలికి వెళితే అభిప్రాయాలు ‘ఒక కొలిక్కి‘ రావు సరిగదా కళ్ళ నిప్పులు కురిపించేవారు తయారవుతారు. ధర్మరాజంతటివాడు కర్ణుడు తనకు అన్నవుతాడని తెలిశాక ‘తెగ బాధ‘ పడిపోయాడు. కుంతి రహస్యాన్ని దాచినందుకు ‘ఆడదాని నోట నువ్వుగింజ‘ నానదు అని ఆడవాళ్ళను రహస్యం దాచలేరని శపించాడు. ఈ పురాణ తెలుగు పలుకుబడి ప్రత్యేక పరిశీలన. కాని ధర్మరాజు వైరాగ్యం చెంది తను అడవికి పోయి తపస్సు చేసుకుంటానన్నాడు. ‘అడవిలో తపస్సు చేసినంత మాత్రాన బాధలు తొలిగి మోక్షం రాదు. మునివాటికల సమీపంలో పెరిగిన చెట్లు మోక్షం పొందాయని ఎవరూ అనలేదు‘ అని నచ్చ చెప్పించుకుని రాజ్యం స్వీకరించాడు. నిజమే మరి! గంగ, గోదావరి వంటి పవిత్ర నదీజలాలలో సేదతీరే కాకి మొదలైనవి పుణ్యం కోసమే స్నానం చేస్తున్నాయనలేము. ఊపిరి బిగబట్టితే బొజ్జ నిండదు. బ్రతికినంత కాలం తిండి తినాలి. బంధువర్గాన్ని పోషించాలి. ధర్మరాజు వైరాగ్యం విడిచాడు. దృతరాష్ట్రుడు నూర్గురు కొడుకులను పోగొట్టుకుని ఇష్టంలేకపోయినా ధర్మజుని ఆశ్రయంలోనే ఉన్నాడు. భీముని చేత తిట్లు తినేవాడు.

ఈ విషయం ఎందుకంటే ‘ఇంటికి ముసలి - ఏటికి మొసలికీడు‘ అనే పలుకుబడి మాట గురించి జీవితపు లోతులన్నీ చూసి కష్టసుఖాల జీవన పరిధిలో - అనుభవ పరంపరలెన్నింటిలోనో సంతోష విషాద గీతిక లాలిపించిన మన సామాజిక జీవనంలో వృద్ధులు చివరి దశలో ‘దృతరాష్ట్ర వైభవంతో‘ జీవిస్తున్నారన్నది ‘అర్ధనగ్న సత్యం‘. ‘పడుచుదనపు మిసమిసలు‘ జీవచ్ఛవమైన వృద్ధ జీవితాన్ని ‘తొంబయి ఏళ్ళ తొక్కు‘ అని నిరసిస్తున్నదో లేదో ఆత్మ విమర్శకే వదిలేద్దాం.

‘ఊరు పొమ్మంటుంది - కాడు రమ్మంటుంది‘ అని సణుక్కుంటూనే ఈ వృద్ధులు పడే కాపీనం కూడా తెలుగు పలుకుబడిలో తొంగి చూస్తూంటుంది. ముసలి వాడిని ‘తాతా! పెళ్ళాడతావా?‘ అంటే నాకెవడిస్తాడురా పిల్లని అన్నాడట. ఆ తాతనే సంధ్య నేర్పుతావా

అంటే 'ఇప్పుడు చదువుకున్న నీకే రాకపోతే అరవై ఏళ్ళకు ముందు చదువుకున్న నాకు వచ్చునా? ' అన్నాడు. 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు' అని పట్టిపట్టనట్లు ఉండే తాత 'నా కెందుకులే' అంటూనే అన్నిటిలోను కలగజేసుకుంటాడు. 'మరి తాతకు దగ్గులు నేర్పాలా?' అన్నది ప్రశంస కావచ్చు, విమర్శకావచ్చు ఏదో సమయంలో ఈ మాట వినబడుతూనే ఉండాలి.

మరి అవ్వో! ఆవిడా ముసిలిదే కాని 'తెరబొమ్మ' జీవితంలో 'నోటిముత్యాలు' రాలుస్తూనే ఉంటుంది. 'అమ్మలక్కల జీవితం' నాటి ముచ్చట్లు 'నాపసాని' తంతులూ ముగిసిపోయినా ముదిమిలో అవ్వకు ఇంకా ఏదో ఆరాటం. అందుకే 'అవ్వతీసిన నూలు తాత మొలత్రాడుకు సరి' అని నోటికి తాళం వేయిస్తోంది. 'దిష్టిపిడత జీవితం' అని తిట్టుకుంటూనే 'దయాధర్మ భిక్ష' జీవితమని అందరిముందు వాపోకుండా పెద్దరికం పెత్తనం ఉన్నాయని 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శించే వృద్ధుల 'తెరవెనుక భాగోతం' గురించి చెప్పే సరదా మనిషిని 'నవ్వుల బండి' అంటారు.

తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, అత్త, కోడలు, అల్లుడు, ఇతర బంధువులు, సంఘంలోని ప్రముఖులు – జీవితాన్ని నిర్వచిస్తూ పలుకుబడిలో దాగి ఉన్నారు. వీరి చుట్టూ అల్లుకున్న జాతీయాలు, సామెతలు లెక్కకు మించి ఉన్నాయి. కాని ఈ నవీన యుగంలో ఈ పలుకుబడి ఆంటీ అంకుల్ మమ్మీ, డాడి సంస్కృతిలో నిష్క్రమించకుండ ఆపగలమా అన్న ప్రశ్న ఉదయిస్తోంది.

తల్లి దైవం. తండ్రి ధనం.. అని తెలుగువాడు తల్లిదండ్రులకు మించిన పూజ్యులు లేరు అని చాటుకున్నాడు. 'తలిదండ్రులు లేకపోయినా బ్రతకవచ్చుగాని పరపతి లేనిచో బ్రతకలేము' అని చెప్పడంలో ఉద్దేశం 'అనామకులు' అని అనిపించుకోవద్దని. తల్లిదండ్రుల కీర్తి చెడగొట్టవద్దని అందులోని అర్థం. తల్లిని నమ్మినవాడు, నేలతల్లిని నమ్మినవాడు ఎప్పటికీ చెడిపోడు. తల్లి పెంచి పెద్ద చేస్తుంది. నేల తల్లి పంటలిచ్చి పోషిస్తుంది. అందుచేత పసితనంలో తల్లి అవసరముంది. తల్లిని, నేలను నిరాదరించకూడదు. వ్యవసాయము చేయనిదే పంట పండదు. ఏడవకపోతే అమ్మైనా పాలివ్వదు. అలాంటప్పుడు తల్లికి కానివాడు దాదికవునా అని దాది పెంపకాన్ని సందేహించింది. 'తల్లికి కానివాడు దాదికవునా?.. తల్లి రోసిన పిల్లను దాదిరోయదా? ' అని నేటి పిల్లల సంరక్షణలో ఏమరుతున్న తల్లిదండ్రులను హెచ్చరించిన పలుకుబడి మన తెలుగు భాష సజీవముగా ఉన్నంత వరకూ నిలవాలన్నది తెలుగు ప్రజల కోరిక.

తల్లి గురించిన పసిడి తెలుగు పలుకులు సేకరించగలిగితే అమ్మను 'మమ్మీ' అని పిలుస్తున్నందుకు తప్పక సిగ్గుపడతాము. తల్లి చనిపోతే తండ్రి పిన తండ్రితో సమానం. ఎందుచేతనంటే బిడ్డ తిన్నదో లేదో తెలుసుకునే బాధ్యత తల్లి నిర్వర్తించినట్లు తండ్రికి పట్టదు. తల్లి చస్తే కడుపు పెద్ద -- అంటే వాడికి ఆకలి ఎక్కువని పెట్టేవాళ్ళు విసుక్కుంటారు. భార్య వచ్చింతరువాత కూడ 'తల్లి కడుపు చూచును-- పెండ్లాము జేబు చూచును' అనే దానిలోని నిజానిజాలు కంటె తల్లికి మాత్రమే ఎంతవయసు వచ్చినా కొడుకు ఆకలి పట్ల శ్రద్ధ ఉంటుందన్న ఆలోచన కాదనే కొడుకు ఉండడు. 'తల్లిలేని పిల్ల – ఉల్లి లేని కూర' సమానం. ఉల్లి చేసే మేలు మాటేమో కాని తల్లి ప్రేమకు సమానమైనది ఏదీ లేదన్నది మన మాట. తల్లికి తగిన బిడ్డ-- ఇంటికి తగిన పందిరి అని అంటారు.

తామర తూడు, గడ్డిపరక, గాలిలోకి లేచిన ధూళి, దూదిపింజ ఎంత చులకనో తల్లి లేని పిల్లలు అంత చులకనవుతారన్నది కవి వాక్కు. 'అమ్మ అన్నది ఒక కమ్మని మాట. అది ఎన్నెన్నో తెలియని మమతల మూట' అని సినీకవులు పాటలు కట్టారు. అమ్మ అనగానే రెండు పెదవులూ దగ్గరగా వచ్చి మమత చూపుతాయి. అందుచేతనే తల్లిని పూజించాలి. అందుచేత మాతృఘాతుకుల గురించి కోకొల్లలుగా సామెతలు తెలుగు పలుకుబడిలో తొంగి చూస్తున్నాయి

'తల్లికి కూడు పెట్టనివాడు తగుదునమ్మ! అని తగువు తీర్చవచ్చాడుట..' అని ఈసడించుకున్నారు. వావి వరుస లేకుండా సరసానికి సిద్ధపడేవాడిని..'తల్లికి కొట్టరా వసంతం'... అని చీవాట్లు వేసి వెనుకకు మరలేలా బుద్ది చెప్పారు.. 'తల్లి చెవులు తెంపిన వానికి పినతల్లి చెవులు బీరపూవులు కావ'ని తిట్టారు..'అమ్మను తిట్టకురా ముండా కొడకా!' అనే పదము కూడా అమ్మను తిట్టినట్లే అవుతుంది కాని అమ్మ పట్ల గౌరవ వాచకం చూపాందుకు హేళనగ ఈ సామెత వచ్చింది.

అత్తగారి సాధింపు అన్న మాట వినని వారుండరు. 'అత్తలేని తెలుగు పలుకుబడి ఉప్పు లేని పప్పులాంటిది.' అత్త చేసే పనులకు ఆరళ్ళు ఉండవు. ఈ విషయం స్పష్టం కావాలంటే ఈ పలుకుబడి ప్రయోగించి తీరాలి.. 'అత్తకొట్టిన కుండ ఆడు గోటెకుండ.. కోడలు కొట్టిన కుండ క్రొత్తకుండ....' అత్త పాత విషయాలు త్రవ్వి తలపోస్తుంది. కోడలు ఆ నైజాన్ని 'పుణికి పుచ్చు'కుని త్రవ్వి తలకెత్తుతుంది.

ఇప్పుడూ అత్తాకోడళ్ళు కలిసుండే రోజులు కావు. అయినా కలిసుంటే ఎలా ఉంటుందన్నది మరిచిపోలేని తెలుగు పలుకుబడి. 'అత్త మంచి వేముల తీపు లేవన్నది' నేటి మాటకూడా. కారణం జ్ఞాపకార్థం ఏడుస్తుందని 'అత్త చచ్చిన ఆర్నెళ్ళకు కోడలు కంట నీరు వచ్చింద'ని చెప్పుకున్నారు. 'అత్తింటి సుఖం మోచేతి దెబ్బ వంటిది. అత్త మంచి వేముల తీపులేవు. అత్తకూడ ఒకరింటి కోడలే! అందుకే అత్తకాలం కొన్నాళ్ళు, కోడలి కాలం కొన్నాళ్ళు. ఏకాలంలోనైనా సరే అత్త లేని కోడలుత్తమురాలు-- కోడలు లేని అత్త గుణవంతురాలు అన్నది తరతరాల తెలుగు మాట నిజం కానక్కరలేదు కాని గుర్తుంచుకునే హెచ్చరికగా అత్తా...కోడళ్ళ అన్యోన్యతకు ముద్దు పలుకుబడిగా నిలవాలి.

అత్త పక్కనే కోడలితోబాటు అల్లుడు కూడా జంట కలుస్తాడు. అత్తమంచిలాగే 'అల్లుడి మంచి ...వేములతీపి' ఉండవంటారు. కాని అల్లుని అత్తాశ గ్రహణం మొర్రిలాంటిది. అది తీరేది కాదు. కాబట్టే అత్త అడుక్కుతింటున్నా అల్లుడు మనుగుడుపులకు వస్తాడుట. అలిగితే కూతుర్ని తీసుకుపోతానని బెదిరిస్తాడుట. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉంటుంది. అందుచేత మర్యాదమాట దేవుడెరుగు. అల్లుడికి నేయి లేదు. అల్లుడి కూడా వచ్చిన వాడికి నూనె ఎలా వస్తుంది. అదలా ఉంచితే కూతురు ఆడపడచుగా అల్లుడితో బాటు చెలరేగితే కష్టమే మరి. ఎందుకంటే ఆడపడుచు స్థానం చాలా శక్తివంతమైనది. 'పిండి బొమ్మనైనా చేసి పీటమీద కూర్చోబెట్టి మర్యాద చేస్తే ఆడబిడ్డ తనాన ఎగిరెగిరి' పడుతుందని లోకోక్తి.

ఆడపడుచైనా, అమ్మయినా, అత్తైనా, కోడలైనా.. వీళ్ళందరూ ఒకింటికి ఇళ్ళాల్లే!

# తెలుగు పలుకుబడి

## డా.జొన్నలగడ్డ మార్కండేయులు



## 9

**ఇల్లు చూచి ఇల్లాలును చూడమన్నారు.** ఇంటి చక్కదనం ఇల్లాలు చెబుతుంది. ఇంటికి జేష్ఠ్యాదేవి, పొరుగింటికి లక్ష్మీదేవిలాంటి ఆడదానివల్ల సంసారం వీధిన పడుతుంది. సాగరం వంటి సంసారంలో కల్లోలాలు పుడతాయి. కొండంత కాపురం కొండేలతో చెడుతున్నది తరతరాల తెలుగు పసిడి పలుకు. ఇంటి గుట్టు రచ్చకీడ్చకుండ అనురాగం, అనుబంధం పొరపచ్చాలు లేకుండా సాగడానికి మన సంప్రదాయం దాచి ఉంచిన పలుకుబడి వినడానికే కాదు సరిదిద్దుకునే హెచ్చరికలు నేటికాలానికి కూడా వర్తించేలా ఉంటాయి.

మన సంసారంలో వచ్చే గొడవలు అత్తాకోడళ్ళ వల్ల ప్రారంభం కాకపోతే అంతకన్నా అదృష్టముండబోదు. తల్లికి కొడుకంటే ఇష్టం. ఎందుకో కోడలుమీద ఎంతమంచిదైన అపోహ పెంచుకుని దూరమయ్యే అత్తగార్లే మనకు ఎక్కువమంది కనిపిస్తారు. అత్త కూడా ఒకింటి కోడలే! కోడలు కూడా ఒక నాటికి కాబోయే అత్తగారు. అందుచేతనే వీళ్ళిద్దరి మధ్య నలిగిపోయే మగవాని పరిస్థితి ‘అత్తాకోడళ్ళ మధ్య అబ్బాయి కక్కసలు‘ అంటారు. అత్తాకోడళ్ళ మధ్య ఆదిపత్యం మొదలయిన ఇళ్ళు నరకప్రాయం. ఒక వరలో రెండుకత్తులిమడవు. ‘ఇరుపోటీల ఇళ్ళు చెడును, వాతనొప్పులు ఒళ్ళు చెడును‘ అన్నట్లు అప్పుడా సంసారికి ఇల్లెక్కి కొరివి త్రిప్పినట్లవుతుంది. అత్తాకోడళ్ళ ఆధిపత్యపోరు అలా ఉంచుదాము. ఏకపత్నీవ్రతులే తెలుగు సమాజంలో ఎక్కువ. మరి ఒకే ఇంట్లో కాపురం చేస్తున్న ఇద్దరు పెళ్ళాల మొగుడు కూడా గుర్తింపుకు నోచుకున్నాడు. ఒక ఒరలో రెండు కత్తులలాగే రెండు కొప్పులొక ఇంట్లో ఇమడవు.

అందుచేత ఇల్లు ఇరకాటం, ఆలి మర్కటం కాకూడదు. ‘ఇరుగింటమ్మా, పొరుగింటమ్మా.. మా ఇంటాయన గోడు చూడండి‘ అన్నట్లు తయారవకూడదు. కొంచెం కటువుగా ఉన్న ఈ తెలుగుపలుకుబడి చాలాకాలం తెలుగువారి నోట నానింది...‘అలవి కాని ఆలిని కట్టుకుని మురిగి చచ్చెరా ముండాకొడుకు‘ అని. ఈలకూర ఉప్పగా ఉంటుంది. ఇష్టంలేని మొగుడు ఈలకూరలో ఉప్పెక్కువయిందని భార్యను కొట్టాడని మగవాడి భార్యా హింసను కూడా మన తెలుగుపలుకుబడి చురకలు వేసింది.

అయితే ముప్పొద్దులా తిన్నమ్మకు మొగుడి ఆకలి తెలియదు. అందులోని ధ్వని ఏమిటంటే భర్త తన ఆశకు తగినంత సంపాదనకు కష్టపడే పాటుకు అలసత్వం వహించిన ‘పోచికోలు తిండి‘గాడని. మరి వరహీనంతో కాకిముక్కుకు

దొండపండులాంటివాడు, ఇష్టంలేని అల్లుడిని ఇలా చీదరించారు.' దెసకొద్దీ దొరికాడు పుసికళ్ళ పెళ్ళికొడుకు' అని. ఇక ముసలి మొగుడి గురించి 'నిశ్చితార్ధం నాడే నీలగవలసింది నాగవల్లిదాకా ఉండడం నా అదృష్టం' అన్న బాల వితంతువులు వరహీనం గురించిన హెచ్చరిక పలికారు. అయినా కాటికి కాళ్ళు చాచిన ముసలి భర్తలు ఎప్పుడు ఉంటారు. అందుకే లెగలేని మొగుడా! బొగళ్ళు చేయించు అంది పడుచు పెళ్ళాం. బొగడ, బావిలి.... అన్నవి చెవికి పెట్టుకునే బంగారు ఆభరణాలు. అందుచేత బ్రతకనీయవే పెళ్ళామా బావిలిలు చేయిస్తాను అన్నాడట ముసలి మొగుడు. అత్తకు బోసత్తకు బోడి మొగుడు ఉంటారు. ఏ సంసారి కైనా 'ఇంట్లో ఇల్లాలిపోరు, బయట బాకీల పోరు' తప్పవు.

ఏ సంసారంలోనైనా కుడుములు వండని ఆడదీ, కూనిరాగం తీయని మగవాడు ఉండడు. కాని పొరుగింటి పుల్లకూర రుచి కోసం అర్రులు చాస్తూనే ఉన్నాం. కూరకోసం పక్కింటిమీద ఒకసారికైతే పరవాలేదుకాని నిత్యం బయలుదేరితే విసుక్కుని లేదన్నప్పుడు కాస్త చమత్కారం జోడించాలి. 'నాశిగ చూసైనా వెయ్యవమ్మా! తెడ్డెడు చింతకూర' అందిట ఓ ఇల్లాలు పక్కింటికెళ్ళి. చింతకూర అంటే చింతచిగురుకూర. పొరుగింటి పుల్లని చింతకూర రుచి మరిగిన ఆమెకు కూర దక్కిందో లేదో కాని పొరుగింటి పుల్లకూర రుచి మాత్రం తెలుగువారు మరిచి పోలేక 'చింత'ను వదిలేశారు. కూనిరాగం మగవాడు మాత్రం గంధర్వుడు అనిపించుకోనవసరం లేదు. కాని గార్ధభ స్వరంతో కర్ణకఠోరంగ మాత్రం పేరుపొందకూడదు .

కొంతమంది స్వార్థపరులైన యజమానురాళ్ళు తిండికే ప్రాముఖ్యమిస్తారు. వాళ్ళపొట్ట వాళ్ళదే! పిల్లలకు పెట్టవలసి వస్తుందని అవతలకు తరిమేస్తారు. 'ఏలకులవంటి మెతుకులు వేసుకుని ఎనుము పెరుగు పోసుకుని యమురాలిని గనుక తింటున్నాను గాని, దగ్గరకు రాకండిరా పిల్లలూ! జడుసుకునేరు' అన్న మాటలు మనిషి స్వభావానికి రచించబడ్డ చక్కని పలుకుబడి. ఇవి సందర్భాన్ని రక్తికట్టించే సంసార జీవనంలో అలవోకగా సాగిపోతుంటాయి. రేడియో జనానికి వినోదమిచ్చింది. కాని అంతకు మునుపు గ్రామీణులైనా పట్టణవాసులైనా తీరిక సమయంలో గుమికూడడం ఉండేది. సభారంభాలు, సభాతీర్మానాలు, పెద్దలకు అగ్రతాంబూలమిచ్చి సన్మానాలు చేయడం, ఆబాలగోపాలం శుభకార్యములలో సమావేశములు, వావివరసల సరస విసుర్లు సంసార జీవితంలో తెలుగుపలుకు తీయతనాన్ని గుర్తింపజేసేవిగా ఉంటాయి.

సాంఘిక కట్టుబాటులో ఎవరి పలుకుబడివారిది. అందుచేత పెద్దమనుషుల పెద్దరికం విషయంలో గుమికూడిన వారిలో అందరూ నిర్ణయించినవాడికి పెద్దరికమిస్తారు. ఇంతలో అతనికన్నా పెద్దరికం వాడొస్తే మళ్ళీ జరిగిందంతా పునరావృత్తం చేస్తూ ఆలస్యంగా వచ్చిన పెద్దమనిషికి అగ్రతాంబూలం ఇవ్వవలసి వస్తోంది. ఎప్పుడో తోలుబొమ్మలాటలో రెడ్డిపెద్దల విషయంలో ఆలస్యంగా వచ్చిన ఒకొక్క పెదరెడ్డికోసం పలుమార్లు ప్రదర్శన ప్రారంభించిన 'తోలుబొమ్మల ప్రొటోకాల్'.. 'పెదరెడ్డొచ్చె మొదలాడెరా' సజీవ పలుకుబడి ఆలోచింపచేస్తుంది. 'తిన్నంటి వాసాలు ఎంచుతావేమిరా అంటే పొరుగింటికి పోతే ఊరుకుంటారా?'... అన్నాడట' తిన్న ఇల్లు కూల్చేవేమిరా అంటే తినని ఇల్లు నేనేమి ఎరుగుదును' అన్నాడట. చేసింది తప్పుడుపనయినా పెద్దమనిషి మందలిస్తే ఇలా తప్పుకుంటా హేళన చేశాము.... కాని 'వెనకటికి ఇలా' అన్న పదము చేర్చకపోతే తెలుగుపలుకుబడికి అందం రాదు. 'వెనకటికి ఇలా' అని చేర్చే తెలుగుపలుకుబడిలోని హాస్యం చురుక్కుమనిపించినా వివేకాన్ని మేల్కొలుపుతుంది.

వెనకటికి నన్నెరుగుదువా?..... అని పలకరిస్తే 'నన్నునేనే ఎరగను, నిన్నేమి ఎరుగుదును' అన్నాడట. 'అదేమిటి.. నమ్మినాను కదరా రామన్నా అంటే.. నట్టేటముంచుతాను లక్ష్మణ్ణా!' అన్నాడట. వెనకటికి ఒకడు 'నా పెండ్లికి నేనూ రావాలా?' అని అడగడమే కాదు. పెండ్లి హడావిడిలో బట్ట కప్పడం మరిచాడట. పెళ్ళి సందట్లో పుస్తె కట్టడం మరిచిపోయాను' అన్నాడట. అయితే ఎందుకు ఏడుస్తావురా బాబూ అంటే ఎల్లుండి మావాళ్ళు కొడతారు అన్నాడట. వెనకటికి పాపట్లో వెంట్రుక మెరిస్తే పతివ్రయైనదన్నట్లు 'బంధుడవు సరేకాని పయిటలో చేతులు పెట్టకు' అంటూ దూరంగా జరిగిన పతివ్రత ' నా పతివ్రతా ధర్మం న మొదటి పెనిమిటి

తెలుసు' అందట. ఇలా వెనకటికి నీలాంటివాడు లేదా నీలాంటిది అని చేరుస్తూ తెలుగుపలుకుబడి సంభాషణ చమత్కారం సొంతం చేసుకున్న మన భాష తీయతనాన్ని ఈ క్రిందివానిలో చూడవచ్చు.

వెనకటికి...'చెరువు మీద అలిగి (ముడ్డి) కాళ్ళు ఎండబెట్టుకున్నాడుట. కోపం సకారణంగా ఉండాలి. 'ఆకలి కాకుండ నీకౌషధమిస్తాను నీ ఇంట్లో చద్ది అన్నం నాకు పెట్టు అన్నాడట.' గుళ్ళో దేవునికి నైవేద్యం లేకుంటే పూజారి పులిహోరకు ఏడ్చాడు' అన్నది నేటి దేవాదాయ దుస్థితి. బ్రతికి ఉండగా పాలు లేవుగాని చచ్చిన వెనుక గంగిగోవును దానం చేస్తాను అన్నాడుట. అందుకే మరి 'బొకరా బొంకరా పోలిగా' అంటే చెవులపోగులను నా జన్మమునే ఎరగదన్నదట. ఒక లోకజ్ఞత లేని కోడల్ని 'మంచిది మా కోడలంటే మదురెక్కి ఏమో చూపిందట.' ఆ కోడలినే లవణం తెమ్మంటే దూడరేణువు తెచ్చింది. పైగా శాస్త్రాల వారింట జనించి సోమయాజులవారింట చొచ్చి లవణమంటే దూడరేణువని ఎరుగునా అని ఎదురు ప్రశ్న వేయడం చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకున్నట్లు పూర్వీకుల పేరు ప్రఖాతులను వాడుకునేవారికి అన్ని విషయాలు కూలంకషంగా తెలుసంటూ ఎగబడేవారికి సిగ్గును కలిగిస్తుంది. మా తాతల మూతి నేతివాసన మామూతులకంటుకుందన్నట్లు వెనకటికి... అంటూ అపహాస్యం పాలు కాకూడదన్న మన పలుకుబడి మరిచిపోలేనిది.

ఇంకా వెనకటికి ఒకడు సమస్త నదీ సంగమ పుణ్య నిలయమైన సముద్రస్నానానికి వెళ్ళి తిరిగి వచ్చేశాడు. 'సముద్ర కెరటాలు పోయాక స్నానం చేస్తాను' అన్నాడట. అలాంటివాడికి రామాయణమిస్తే 'ఏమిటో అనుకున్నాను కాని మాసి బరువున్నది' అన్నాడట. కొందరు అమాయకులుంటారు. వెనకటికి అలాంటివాడిని 'దున్నపోతు ఈనిందంటే దొడ్లో కట్టెయ్యరా' అన్నాడట. 'వెనకటికి ఓ చెల్లెలు అప్ప అత్తవారింటికి వెళితే అప్పగుడ్డలన్నీ నేనే కట్టుకోవచ్చు అందిట.'

తన కోడికూత, కుంపటి నిప్పుపొగ లేకపోవడం వల్ల ఊళ్ళో తెల్లవారి ఉండదన్న ముసలమ్మ అమాయకత్వం మనకు తెలుసు. ఇంకా కల్పితమో లేక నిజమో తెలియని అదృష్ట జాతక మిడతం బొట్లు, పరమానందయ్య శిష్యుల అమాయకత్వంలోని అసహజత, అస్వాభావికం ఉపమాన పలుకుబడిగ నిలిచి కథా రచనకు ప్రోత్సాహకాలవుతున్నాయి. ఎంత చదువుకున్నా విదేశాల కేగినా మన నమ్మకాలు మనను విడిచి పెట్టవు. నవగ్రహాలు మననమ్మకాలు మనను విడిచిపెట్టవు. నవగ్రహాలు మన మత పరిశీలనలో దేవతలు మామూలు గోళాలు కావు.




## 10

**నేటికీ పల్లెటూళ్ళో (డప్పుకొట్టి) టముకు వేయడం ఉంది.** ఏటికి వరద ప్రమాదమున్నప్పుడు, పన్ను వసూలుకు, సంత జరుగుతున్నపుడు, ఇప్పుడైతే కోటా సరుకులు బియ్యం మొదలైనవి ఇస్తున్నపుడు టముకేసి చాటడం ఉంది. 'టముకేసి చెప్పక్కరలేదు' అనే మాట మనల్ని ఎత్తిపొడుస్తూ మాట్లాడేవారితో అంటూంటాము. శృంగనాదం చేసుకుంటూ జీలకర్ర అమ్మిన రోజులు ఇప్పుడు లేవు. దానినే సింగినాదం---జీలకర్ర అని పక్కకు తోసేసాం. టముకేసి చెప్పక్కరలేదన్నా సింగినాదం, జీలకర్ర అన్నా ఎత్తిపొడుపు మాటలను త్రిప్పి కొట్టి వాడుక పదంలో చేరిపోయాయి. ఈ వెటకారం వాడుక జీవనంలో తొంగిచూస్తేనా అందం.

'అనిత్యానిశరీరాని, అందరిసొమ్మూ మనకేరానీ' శరీరం శాశ్వతం కాదంటూనే ఇతరుల సొమ్ము కోసం కక్కుర్తిపడే నీచ స్వభావుల గురించి ఈ మాట పుట్టింది. అందుచేత అలకాపురికి రాజైనా అమితంగా ఖర్చు చేయకూడదు. అడక్కుండ చెప్పులిచ్చాడు, అడిగితే గుఱ్ఱమిస్తాడు అని డబ్బున్నవాడి చుట్టూ తిరిగేవాడికిది చురక. అధికాశ లోకదరిద్రం అనేమాట అందుకే పుట్టింది. అరవై ఏళ్ళు నిండినవాడిని ఆలోచన అడక్కు, ఇరవై ఏళ్ళు నిండాక కాని పెత్తనమీయకు అన్నది చురక కాదు. సలహా. ఇరవై దాటిన యువకుని జీవన శైలి ముసలి పెత్తనాన్ని దూరంగా ఉంచుతుంది. అందుచేత అరవై నిండాక 'అగ్గిగుండం' గుర్తించకుండా ఇంకా పెత్తనం చేసి 'అర్లు మర్లు' (మోహము) బిరుదు తగిలించుకోకూడదు. ఆమె పేరు కుంతలమ్మ, చూడబోతే బట్టతల అన్నట్లు 'ముసలిపెత్తనం' అనేమాట ఆరిపోయేముందు ప్రకాశంగా వెలిగే దివ్వెలాంటిది. 'ది ఓల్డ్ మాన్' మాట మనకు అలవాటయిపోతోంది. సిగ్గనిపించదు.

కోర్టుకెక్కి గెలిచిననాడు ఇంట్లో ఏడిస్తే, ఓడినవాడు వీధుల్లో ఏడుస్తాడు. న్యాయ పరిష్కారం కోసం కోర్టు చుట్టూ తిరిగేవారికి నాశనం తప్పదు. బాగుపడేది మాత్రం వాదించిన వకీలు అని చెప్పే మన తెలుగు హెచ్చరిక మనం మరిచిపోకూడదు. కోర్టుకెక్కినవారు ఒకరు ఆవు కొమ్మును, ఇంకొకరు తోకను పట్టుకుంటే మధ్య వకీలు పొదుగు దగ్గర కూర్చుంటాడు. సాధారణంగా తగువులు ఆస్తిపంపకాల దగ్గర వస్తాయి. ఒకప్పుడు ఆస్తిలో ఆడపిల్లకు వాటా లేదు. అందుచేత అన్నదమ్ముల శత్రుత్వం, అక్కచెల్లెండ్ర మిత్రత్వం అనే తెలుగుభాష పలుకుబడిలో జీవించింది. అన్నదమ్ముల పొత్తు చిన్నప్పుడు, అప్పచెల్లెళ్ళ పొత్తు పెద్దప్పుడు' అనే మందలింపు మన

భాష నుంచి కనుమరుగయి మా బ్రదరు, మా సిష్టరు అంటూ పాడిపాడి ధ్వని 'ఆర్చేవా తీర్చేవా అడుగున బడితే లేవదీసేవా' అని ఇద్దరు కూడితే 'ఇంగలం'(బొగ్గు) లేకుండానే మంట పుడుతుందన్న సహజ తెలుగుపలుకుబడిని ఎరువు తెచ్చుకోనక్కరలేదు. జుట్టు, జుట్టు పట్టుకుంటుంది.

కాకి అరిస్తే చుట్టాలు వస్తారని నమ్మినా నమ్మకపోయినా కాకి అదేపనిగా అరిస్తే చుట్టాలు వస్తారని అనకపోతే మనకు తోచదు. అలాగే కుక్కలు కూస్తే కరువు, పొయ్యి అరిస్తే బంధువులూ అని అంటాము. తీతువు పిట్ట తీర్చి అంటే చక్కర్లు కొట్టకుండా కూస్తే మంచిది. కట్టిఅంటే గ్రామ మధ్యలో చుట్టూ తిరిగితే అమంగళమని మూఢనమ్మకం కావచ్చు కాని పలుకుబడిలో అనుకోకుండా సంభాషణలో దొర్లుతూనే ఉండాలి. గోహత్య, పిల్లి హత్య మహాపాపాలని అనడానికి ఒకప్పుడు హెచ్చరిక నేడు పనికిమాలినవే అయినా గోవును చంపి చర్మాన్ని చెప్పులు కుట్టించి దానం చేసేవాళ్ళు పిల్లికి భిక్షం పెట్టని పిసినార్లు 'ఉడత ఊపులకు మానులూగునా' అని పాపం అంటే ఏమిటని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. 'తులసి కోటలో ఉమ్మేశినావేమిరా అంటే యజ్ఞవేదిక అనుకున్నాను అన్నాడుట' ఈ తెలుగు పలుకుబడి అకారణంగా మతనింద చేసినవారిని ఈసడించడానికి సజీవం చేయవలసిన అవసరముంది. తురకవీధిని సన్యాసిభిక్ష, తులసివనంలో గంజాయి మొక్క, పనికిరావు. తురకల ఈదు పండుగలో హిందువులింటికి పారిపోయిన మేక, సంక్రాంతి పండుగకు తురకవీధిలో తిరిగిన గంగిరెద్దు కోయబడకుండ తిరిగి వచ్చే రోజులు కావివి. అయినా 'పెంట తినెడి కాకి పితరుడెట్లాయెరా' అన్న వేమన ఆటవెలది తెలుగు పలుకు ప్రపంచమ్మతా తిరగ గలిగినా 'పాతలో పడ్డకుక్క తియ్యబోతే కరవ వచ్చిందన్నట్లు' మన సహజ పలుకుబడికి హాని కలిగించకూడదు. 'నీవాణ్ణే నువు తిట్టకపోతే తెలుగువాడివికావు' అని అనిపించుకున్నా వేమనలా కవిత్వం చెప్పకపోయినా తెలుగులో కూడ దెప్పడానికి ప్రయత్నిస్తే ఆంగ్ల భాషనాశ్రయించనక్కరలేదు.

చేతిలో ధన రేఖ, వైభోగ రేఖ, ఆయువు రేఖ, సంతాన రేఖ ఉంటాయి. అందుకే రేఖేసుకు పుట్టాడు అనేమాట వాడుతాం. ఇప్పుడు మనం లక్కీఫెలో అని ఇంగ్లీషులో అనేసి ఆ పదాన్ని మరిచిపోయాం. హస్తసాముద్రిక శాస్త్రం పుట్టింది. భవిష్యత్తు, జ్యోతిషం అనే మాటలు మరుగున పడ్డాయి. ఫ్యూచర్, పామిష్టరీ అనే పదాలు భాషలో ప్రవేశించడం అవసరమా? నక్షత్రాలు శాశ్వత జ్యోతులైనా చీకటిపడినప్పుడే వెలిగేది. నక్షత్రమండలం గ్రహకూటమి వల్ల మన గ్రహస్థితిని లెక్కకడుతున్న జ్యోతిష్యం గురించి సామాన్యులకు కూడా అవగాహన తెలుగు పలుకుబడిలో దొర్లుతూ ఉంటుంది.

సాముద్రిక శాస్త్రప్రకారం స్త్రీ పురుషులను పద్మిని, హస్త, చిత్త, శిఖండి జాతులుగ చెబుతూంటారు. కించపరచడానికి కాదుగాని కొందరి శరీర ఆకారాల గురించి ఈ విధమైన ప్రచారముంది. పురచేతితో పనిచేసేవాడు, చిన్నచెవులవాడు దవడలు కొరికేవాడు, మీసకట్టు రానివాడు, ఛాతీమీద వెంట్రుకలు లేనివాడు... మోసగాళ్ళని సాముద్రిక వేత్తలు అంటారట! కొందరి పట్ల పరిశీలనాంశ చిరాకు తప్ప అందరికీ ఇది వర్తిస్తుందని సాముద్రికవేత్తలు చెప్పడం హర్షనీయం కాదని నా ఉద్దేశం. కాని లాభంగల కాలమైతే గుర్తుగ్రహం జన్మరాశి పదకొండవ స్థానంలో ఉంటే "పట్టిందల్లా బంగారం, ముట్టిందల్లా ముత్యం" అవుతుందనే తెలుగు పలుకుబడి జ్యోతిషానిదే! "అదృష్టం అరికాల రాస్తుంటే దురదృష్టం నెత్తిని పెట్టుకుని ఊరేగుతుంది" అన్నమాట శని అష్టమాన ఉండడంవలన పుట్టిన సాముద్రిక పలుకుబడి ఇప్పుడు 'ఫేట్' అనే ఒక్క ఇంగ్లీషు పదంతో సాముద్రిక పరిజ్ఞానపలుకుబడికి మనం దూరమయ్యాం.

బుధగ్రహం ప్రకాశవంతంగా ఉదయిస్తే దేశానికి అరిష్టం. తోకచుక్కలు ఉదయించకూడదు. వీటిగురించిన విజ్ఞానం, నమ్మకాలు తెలుగు భాషలో ఎవరికీ తీసిపోనంత విజ్ఞానాన్ని కలిగి ఉన్నాయి. కాని దురదృష్టం. మన గ్రహాలు, నక్షత్రాలు ప్లానెట్స్, స్టార్స్ అని ఇంగ్లీషు సమానార్థకాలులో వాడుతున్నాం. తెలుగు మాటలు తెలుసుకునే పరిజ్ఞానం ఎందుకు అనే ఆంగ్లమోజు ధోరణి తెలుగు సాముద్రిక వేత్తలకు కలగనంత కాలమూ తెలుగు పలుకుబడికి గల గ్రహ, నక్షత్ర పరిజ్ఞానం గల లోకోక్తులు సేకరించి తీరవలసిందే

'గ్రహస్థితి బాగుంటే గంగ వచ్చి పంగు మీద పడుతుంది' అన్నది చక్కటిమాట. గంగ అంటే ఆకాశగంగ లేదా గంగానది ప్రవాహమై వచ్చి పంగు అంటే కుంటివానిని స్నానమాడించి ముక్తినిస్తుందన్నది గ్రహస్థితివల్లనే అన్న ఈ తెలుగు వారి విశ్వాసం లోకోక్తిగ ఆదరణీయం. నిర్మలంగా సాగిపోవలసిన మన జీవితంలో భవిష్యత్తు తెలుసుకోవాలన్న ఆశ లేదా బలహీనత ఆకర్షింప చేసినా అసహజమనిపించినా మన సంభాషణలో తొంగి చూడవలసిందే అదృష్టం, దురదృష్టం అనే పదాలు జ్యోతిషానివే!. వీటి చుట్టు జీవించేవారు స్వాభావికంగానో పోలికలోనో తెలుగు పలుకుబడిలో... అరచేతులు చూసేవాళ్ళు, చిలకజోస్యం చెప్పేవాళ్ళు, వాస్తుశాస్త్రం చెప్పేవాళ్ళు, కళ్ళగంతల ప్రశ్నగాళ్ళు... ప్రత్యక్షమవుతారు. పలుకుబడిలో వాళ్ళ పేర్లు స్థిరమయినా వీరిలో చాలామంది నమ్మకంతో భయపెట్టేవాళ్ళే తప్ప శాస్త్రపరిజ్ఞానమున్నవాళ్ళను 'వేళ్ళమీద' లెక్కకట్టవచ్చు. అందుకే అందరికీ శకునం చెప్పిన బల్లి కుడితిలో పడిందన్న తరతరాల మాట మిడిమిడి జ్ఞానం మాత్రంగల వాళ్ళమీద ప్రయోగించడానికి అవసరం. జ్యోతిష్యంలో నమ్మకమే ముఖ్యమట!. 'నడిస్తే ఊరంతా మిత్రులు. పడుకుంటే చాపకూడ శత్రువే అన్నది గ్రహస్థితిని గురించిన మాట'! చేసుకున్న కర్మమోయి శంభిలింగమా అంటే అనుభవించకతీరదోయి అబ్బులింగమా అనేది సరదా సరదా మాట. 'గ్రహచారం చాలక రాజకము (రాజుల గుంపు) పోతే గ్రామ శాంతికి బోడితల అని జన్మ నక్షత్రం చూచి నెత్తి గొరిగించారుట' అన్నది తరతరాల చక్కటి పలుకుబడి.

అచ్చిరాని కాలానికి అడుక్కుతినబోతే ఉన్న బొచ్చికాస్త ఊడ్చుకుని పోతుంది. అచ్చివస్తే హనుమంతుడి మోర, లేకపోతే కోతిమోర అన్నది భవిష్యత్తు నమ్మి ప్రవర్తించేవారికి ఒక చురక. ఆదివారం అందలం ఎక్కనూలేదు, సోమవారం నాడు జోలె ఎత్తనూ లేదు అన్నది ముహూర్తాన్ని గురించి. అందుకే ఎల్లుండి పొద్దున ఏకాదశి అని ఏమీ నమ్మం అనేవారిమాట.

అటయితే ఆడపిల్ల ఇటయితే మగపిల్లవాడు.. అన్నీ నేను ముందే చెప్పాననే మిడతం బొట్లుగాళ్ళను పలుకుబడికి చేర్చాం. వీళ్ళను నమ్మని రోజున బూతులు తిడతాం. టాటాలు గుణించన వీరిమీద మనం ప్రయోగించేది ఎనిమిదవ లేదా తొమ్మిదవ అట్టం అంటే బూతుల పంచాంగం. శుక్ర నక్షత్ర దర్శనం మమిచి కాదని జ్యోతిశ్శాస్త్ర పలుకుబడి ప్రచారంలో ఉంది. శుక్రుడినే తెలుగువారు చుక్క అంటారు. పనిచెడిపోయినపుడు, ఆటంకాలు ఎదురవుతున్నపుడు "చుక్కెదురు" అనే మాట తెలుగు పలుకుబడికి గ్రహ పరిశీలన నుంచి వచ్చి చేరిందే. మన అదృష్టం, దురదృష్టం, కర్మ సిద్ధాంతం గ్రహానుకూలతకు ముడివడి సృష్టించిన శాస్త్రం 'గుడ్డినమ్మకం' అని కొట్టిపారేసేవాళ్ళ సంఖ్య కన్నా రాజకీయనాయకుల నుంచి, అతిపేదవాని వరకూ మిడతం భొట్లగాళ్ళను ప్రశంసిస్తూ ఆకర్షితులవుతున్నవారి సంఖ్య ఎక్కువ జ్యోతిష సంబంధ పలుకుబడి సేకరించి తీరాలి.




## 11

**అనుభవ వైద్యం మన పలుకుబడిలో తొంగి చూస్తూ ఉంటుంది.** 'తియ్యని రోగాలు, కమ్మని మందులూ ఉండవు' అని తల్లి అయినా మందలించో, బుజ్జగించో దగ్గుకి, జలుబుకి మిరియాల కషాయం త్రాగించిన రోజులలో సాగిన పలుకుబడి 'నాన్సెస్' పలుకుబడితో మరుగున పడిపోతోంది. 'రోగానికి మందుంది, ఆయుర్దానికి మందులేదు' అనే వేదాంతంతోనే 'ఆరోగ్యమే మహాభాగ్యమనే' హెచ్చరిక మరపురానిది.

'మర్దనం గుణమర్దనం' అనేమాట నాలుగు తగిలిస్తే తిక్క కుదురుతుంది అనే సందర్భంలో ఉపయోగిస్తాం. ఇంగ్లీషు వైద్యం అందుబాటులేని రోజులలో ఆయుర్వేదమే ప్రముఖపాత్ర వహించింది. మూలికలనుంచి తీసిన తైలం వాతకీళ్ళ నొప్పులకు ఎంత మర్దిస్తే అంత గుణం అన్నది వైద్య పరిభాష. అలాగే ఆయుర్వేద మూలికలు నూరి గుళికలు తయారు చేయడానికి కల్వంలో నూరేటప్పుడు కూడా ఈ మాట ఉపయోగిస్తారు. 'బాలజ్యోతిషం, వృద్ధవైద్యం' అనేమాట మరిచిపోలేనిది. చిన్న వయసులో మేధ చక్కగా పనిచేస్తుంది. అందుచేత గ్రహ చలనాన్ని యువ జ్యోతిష్కుడు చక్కగా గుణించి భవిష్యత్తు ఫలితాన్ని చక్కగా అంచనా వేయగలడు. వృద్ధవైద్యుడు చక్కని సలహా ఇవ్వగలడు. అందుచేతనే... 'లంఘనం (లంకణం) పరమౌషధం', 'ఉల్లిచేసే మేలు తల్లిచేయదు', 'పైత్యరోగికి పంచదార చేదు', 'శొంఠి శోధిస్తుంది', అనే పలుకుబడి మరిచిపోలేకపోతున్నాము.

'తిన్నదానికంటే అరిగిందే బలం' అని మితాహారం గురించిన తెలుగు పలుకుబడిలో వైద్య రహస్యం దాగి ఉంది. రుచిగా ఉంది కదాని ఎక్కువ తింటే అజీర్తి రోగం తప్పదు. అది ప్రాణాంతకం కూడా. అందుకే సరదాగా ఒక సామెత కూడా పుట్టింది. యమలోకానికి వచ్చిన మానవజీవిని యముడు 'తినిచచ్చావా? తినక చచ్చావా' అని అడిగాడు. 'మితంగా కాక దొరికింది కదాని ఆబగా తిని అజీర్తితో చావలేదు కదా' అనే వ్యంగ్యం ఇందులో కనబడుతుంది.

'ఆదిలో దైవం ఆఖరికి దయ్యం' ఉపకారం పొందినవాడు కృతఘ్నత చూపిస్తే ఈ పలుకుబడి ఉపయోగించని తెలుగుదనం ఊహించలేనిది. రోగం తగ్గాక వైద్య కట్నం ఎగగొట్టినవాడి గురించి ఈ మాట పుట్టినా అల్పబుద్ధి వాడికి కొరడాలా తగిలేమాట ఇది.

కుజనుడైన వైద్యుడు ప్రజలకు రోగాలు రావాలని కోరుకుంటాడని మన నమ్మకం అటువంటి వైద్యుడు ‘కొండనాలుకకు మందువేస్తే ఉన్ననాలుక ఊడిపోతుంది.’ అయినా ‘ఆయుష్యం కలుగుంటే హస్తవాసిగల వైద్యుడి దగ్గరకు వెళతాడు’ కాని ‘ఎన్నో రణములు కోశానుగాని నా రణమంత (పుండు) వాపు నీదికాదనే వైద్యుడి చేతిలో చిక్కడు. అటువంటి వైద్యుడు ‘అన్నిరోగాలకు వాతవైద్యం’ ఎన్నుకుంటే దూరంగా ఉంచాలి. అయినా ‘ఔషధం కానిది అవనిలో లేదు’ అన్నది తెలుగు మాట. అయితే ‘ఔషధానికి ఆ పథ్యానికి చెల్లు’ అనికూడా మనమే సరిపెట్టాం.

‘ఆశపడి వెల్లుల్లి తిన్నా రోగం అట్లాగే ఉంది’. ‘అరనిమిషం భోగానికి ఆరు నెలలరోగం’. ‘జలుబుకు ముందు తింటే వారం, తినకపోతే ఏడురోజులు’ అనుకోవడం జలుబు వంటి కొన్నిరోగాలు ఎలా వచ్చాయో అలా పోతాయన్న దానికి వ్యంగ్యం. అందుకే తన సంగతి తాను చూసుకోలేని వాడిని మనం ఇలా ‘ఆకలి గాకుండా మందిస్తా, ముందు కాసిని గంజినీళ్ళుపోసి నా ఆకలి తీర్చు’ అని వెటకారమాడతాము. ‘అన్న హితువులేనినాడు అన్నీరోగాలే’! ఇక రోగాలు ‘అన్నీ అయిన తరువాత అగ్ని వైద్యం’.. అనే వేదాంతం మన తెలుగు పలుకుబడిలో వినిపిస్తూనే ఉంది. ‘అనువుగానిచోట పుండు, అల్లుడి వైద్యం, చెప్పుకుంటే ప్రాణం పోతుంది’ హాస్యానికైనా బలవంతపు ఔషధ సేవనం గురించి ఇలా ముచ్చటించుకోవడం అలవాటు. ‘వ్యవసాయం అడుసులో నాటిన స్థంభం’. ఎటు ఒరుగుతుందో తెలియదు. ‘విత్తనం చెడినా వ్యవసాయం విడవకు’ అని రైతు భావించాడు. ఎందుకంటే పెట్టుబడి వచ్చినా రాకపోయినా, అతివృష్టి అయినా అనావృష్టి అయినా ‘వ్యవసాయం దండగ’ అన్న నైరాశ్యం నుంచి బయట పడుతుందని ఆశిద్దాం. ‘తల్లిని నమ్మినవాడు, ధరణిని నమ్మినవాడు చెడిపోరు’ అన్నది సజీవంగా ఉండవలసిన తెలుగు పలుకుబడి.

నేదునూరి గంగాధరంగారు రైతు గురించి ఇలా అన్నారు. "రైతు రాత్రింబవళ్ళు కష్టించి సేద్యం చేసి భూమి నుండి పంటను పండించి యావత్రపంచాన్ని పోషించే ‘కర్మశాలి’. చదువు సంధ్యలు లేకపోయినా, పండగలను బట్టి కాలమును గణించే ‘గణికుడు’. ప్రకృతి దృశ్యమును పరిశీలించి ఫలాఫలములను నిర్ణయించే ‘జ్యోతిష్కుడు’. పశులక్షణములను సాంగోపసాంగముగ చెప్పగల ‘ప్రజ్ఞాశాలి’. కార్తులనను సరించి కాలగతులనూహించి సేద్యం చేయగల శేముషీ ధురంధరుడు. అదునెరిగి, ఆయా ఫలసాయం పొదుపు చేసి కావలసిన విత్తనములను భద్రపరచిన ‘శాస్త్రవేత్త’.." అని.

అశ్వని మొదలుకుని మనకు ఇరవైఏడు నక్షత్రాలున్నాయి. ఒకో నక్షత్రం ఒకో కార్తెతో పేరు కెక్కింది. పదమూడు లేక పధ్నాలుగు రోజులపాటు ఈ నక్షత్ర కార్తెలో జరిగె సూర్యసంచారాన్ని బట్టి వర్షం పడే అవకాశముంది. "అశ్వని కార్తెలో వానపడితే నష్టం. ‘భరణి కార్తెలో వర్షం పడితే తొలకరి పంటకు లాభం.’ ‘మృగశిర కార్తె బిందిస్తే ముసలెద్దుకూడా రంకెవేస్తుంది.’ - అంటే వానాకాల సూచన అది ‘ఉత్తర కార్తెవాన చూసి ఎత్తర గంప’ అన్నాడు ప్రాచీన రైతు. స్వాతి వాన ఆనందం కలిగిస్తుంది. ‘విశాఖకా కార్తెలో వాన పిశాచి వాన’. అది తుఫానుల కాలం రైతు ఆశలకు ఈ కార్తె గొడ్డలి పెట్టయ్యే అవకాశముంది...." ఇలా వెలసిన రైతు పలుకుబడి పల్లె సంస్కృతితో నేటికీ విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉంది. ప్రాచీన రైతు అనుభవసారాన్ని వర్షఫని, వనమాల, రెట్టమతం వంటి కాల విజ్ఞాన శాస్త్రాలు గ్రంధస్థం చేశాయి. దోనయామాత్యుడనే కవి సస్యానందమనే 225 పద్యాల రచనలో ఉన్న ప్రతి సంవత్సర వర్షపాతం, అనావృష్టి, అతివృష్టి గురించిన శాస్త్రీయ చర్చ వెలుగులోకి రాగలిగే అవకాశాలు లేవు.

వానరాకడ ప్రాణం పోకడ ఎవరికీ తెలియదంటూనే ఇలా ప్రాచీన రైతు వర్షపాతాన్ని లెక్కగట్టి ఉంచాడు కాబట్టే అతను అందించిన గ్రామీణ ప్రకృతి పరిశీలన నేటి సస్యానుకూలానికి కావలసినట్లుగా జలవనరులను వినియోగించుకునే ప్రయత్నాలు చేస్తున్న విజ్ఞానానికి నాంది పలికిందంటే అతిశయోక్తి ఉన్నా నిజముందని ఒప్పుకు తీరాలి.

రెట్టమతం వంటి కాల విజ్ఞాన శాస్త్రాలు మరుగున పడినా, వాటి ప్రభావం - రచయితలకు స్ఫూర్తినిచ్చిన ప్రాచీన రైతుకు జోహారు చేయిస్తాయి. ప్రాచీన రైతు విజ్ఞాన విషయాలు కలిగిన గ్రంధములు పరిశీలనకు నోచుకోబడిననాడు రైతు విజ్ఞాన విషయాలు వెలుగులోకి వచ్చి శాస్త్రజ్ఞుల మెదడుకు పదును కలిగించే కొత్త అంశాలు గోచరించవచ్చు.

'విత్తనంలో లేనిది విశ్వంలో లేదు. విత్తుచల్లుటకు విసుగు కూడదు' అనే రైతు ఉన్నంత కాలమూ పచ్చపచ్చని చేలతో పల్లెలో ఎన్ని నాగరికతలు వెర్రితలలు వేసినా -- నవయవ్వన్ ముఖ సౌందర్యాన్ని ప్రతిబింబిస్తూన్న పంటలక్ష్మి ప్రధాన వృత్తితో గ్రామాలు కళకళలాడుతున్నాయి. కాని నకిలీ విత్తనాలతో మోసపోతున్న ప్రత్తి రైతు, ఇతర రైతుల తీవ్ర ఆందోళనలు విషాదాన్ని మిగిల్చిన వార్తలు గల నేటి వ్యవసాయ చిత్రరంగం మనసును కల్లోల పరచకమానదు.

ఆధునిక పరికరాలు వచ్చాయి. రైతు ఆధునిక పరికరాలు అంటే ట్రాక్టరు వంటివి రావడంతో నాగలి కట్టడం ఏరువాక సాగడం, దుక్కి దున్నడం, కుప్పవేయడం, పైరగాలిలో వెన్నెల రాత్రులలో చలిని లెక్క చేయకుండా ఎడ్లు కట్టి పాటలు పాడుతూ కుప్ప నూర్చడం వంటి సరదాలు మృగ్యమైపోయాయి. దాంతో పశు సంపద నిర్లక్ష్యానికి గురవుతోంది. 'పాడికి పంట తమ్ముడు' అని పశు సంపద కలిగి ఉండడం గొప్పగా భావించే వ్యవసాయదారుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది.

'పంటకు ఎరువు కావాలి. పాడికి మేతకావాలి'. అందుచేతనే 'పంట పెంటలో ఉంది. పాడి మేతలో ఉందని' పశువులను మేపడం రైతులు చేసేవారు. పశువుల వ్యర్ధపదార్థాలు పెంటగా ఎరువుగా వాడి భూసారాన్ని కాపాడుకునేవాడు నిజమైన రైతు అని నేటి రైతు గ్రహించకపోలేదు. అయినా నేడు వాటి స్థానాన్ని ఎరువులు ఆక్రమించడం మనం చూస్తున్నాం. దీనివల్ల పంట దిగుబడి పెరిగింది తప్ప భూసారం పెరగాలంటే సహజ వనరులను సృష్టించుకోవాలన్న తపన మరిచిపోలేని రైతు పశు సంపదను వదులుకోలేకపోతున్నాడు.

"పాడి అంత సుఖం, దూడంత దుఃఖం లేదు" అని భావించే నవీన రైతు ఆధునిక పరికరాలు, ఆధునిక ఎరువులు వాడడంతో చెంగు, చెంగున దూకే తువ్వాయిలు, - గ్రామ వీధులలో కనిపించడంలేదు. పాలసరఫరా కేంద్రాలు ఏర్పడి రైతు పాలను వాటికి సరఫరా చేస్తుండడంతో వెన్న చిలుకుల కవ్వింపు చప్పుడులు, లయబద్దమైన జానపద గీతాలు ఊహా చిత్రాలుగా మారిపోతున్నాయి. వ్యవసాయ కూలీకు కూడా జట్లుగా సంఘాలుగా ఏర్పడి యాంత్రికంగా పని చేసుకు పోవడమే తప్ప కమ్మటి ఊసులు. కలుపు పాటలతో కూడిన ఉత్సాహభరితమైన వాతావరణం కనిపించదు.

పంట నూర్చి ధాన్యం ఇంటికి తెచ్చుకోవడమన్నది ఒక చలనచిత్ర దృశ్యంలా ఉండేది. ధాన్యం నూర్చడానికి కల్లం చేయడం మొదలుకుని, ఎద్దుతో సమానంగా కుప్పనూర్చి -- పొల్లు గింజను ధాన్యం నుంచి వేరుచేయడానికి, చేటలతో 'తూర్పారబట్టే' వరకు రైతు తాను ఉత్సాహపడుతూ తనతో పని చేసే వారినందరినీ ఉత్సాహపరిచేవాడు. భోజన విరామ సమయంలో పాలేరు, కామందు అన్న బేధం లేకుండా, ఒకరికొకరు ముద్దలు పంచుకునే దృశ్యం నేడు కనలేము. యాంత్రిక యుగం ఈ సరదాలకు తెరవేసింది.

రైతు, వ్యవసాయంలేని గ్రామాన్ని ఊహించడం కష్టం. అతి ప్రాచీనమయిన వ్యవసాయ వృత్తి అన్ని వృత్తులకు మూలం. పల్లెలో సందడి, పండుగలు పుట్టడానికి కారణం వ్యవసాయదారుడే! తెలుగు వారి సంక్రాంతి, ఉగాది, జానపద కళాభిమానం పల్లెనుంచి పట్నానికి ప్రాకి సంబరాన్నిచ్చాయి. రైతు జీవనంలోని విషాదానికి కారణం యాంత్రికజీవనం. రైతు విజ్ఞాన శాస్త్ర పలుకుబడి సేకరించడం తెలుగు వారందరి కర్తవ్యం. మన పురాణేతిహాసాల ప్రాచుర్యానికి కారణం కూడా పురాణ కాలక్షేపములు ప్రోత్సహించిన గ్రామీణ రైతే కారణం.




## 12

### *పురాణ పలుకుబడి*

**ఒకప్పుడు గ్రామీణ జీవితంలో** కాలక్షేపమంటే పఠనమే! ఈ కారణం చేత పురాణ సాహిత్య పలుకుబడి మన తెలుగు బడిలో గణనీయంగా ఉంది. ఈ పలుకుబడిలో పురాణ పురుషుల చర్యలను ఉపమానాలుగా తీసుకుంటున్నాం. సమయం సందర్భమును బట్టి మనుష్యుల గుణ, శీలములకు ప్రబోధాత్మక విషయంగా సూటిగా హత్తుకునేలా ఈ పలుకుబడి ఉంటుంది. "వీటిలోని భాష భావాలను రసమయం చేస్తూ ధర్మబద్ధంగా ఉంటవి" అని నేదునూరి వారి పసిడిపలుకు.

ఆదికావ్యం రామాయణం. అన్ని భాషలలోనూ రామాయణం ఉంది. శ్రీరామ చంద్రుడు భారతీయుల ఆరాధ్య దైవం. హిందువులకు ఆదర్శపురుషుడు. 'రామరాజ్యం' కావాలన్నది దేశ ప్రజల ఆశ. అతని బంటు 'నమ్మిన బంటు' హనుమంతుడు. అందుకే రామునివంటి రాజు, హనుమంతుని వంటి బంటు కావాలి. సముద్రం అవలీలగా లంఘించిన మహావీరుడు హనుమంతుడితో ఒక మామూలు కోతికి పోలికలేదు. అందుకే బలంలో గొప్పవాడిని పోల్చినప్పుడు హనుమంతునికి కుప్పిగంతులు నేర్పాలా అంటాం. కాని ఆ గొప్పవారిముందు మిడిసిపడే అల్పుణ్ణి "హనుమంతుని ముందరా కుప్పిగంతులు అని మందలిస్తాం.

హనుమంతుడికి కూడ చురకులున్నాయి. సీతను చూసి రమ్మంటే లంకను కాల్చివచ్చాడు. అందుచేత చెప్పినపనికన్నా చేసిన పని అధికమైతే "చూసి రమ్మంటే కాల్చివచ్చాడు అనే దెప్పిపొడుపు తెలుగువారిదే!. రామాయణంలో మనకు వారధి కట్టినపుడు 'ఉడత సాయం' రాముడు దాని వీపు మీద చారలున్నంతకాలమూ గుర్తుండేలా శాశ్వతం చేసి పలుకుబడిగ అందించాడు. ఉడుత సాయం 'ఉడతాభక్తి' గ పలుకుబడిలో సాయం చేసి గుణం కలవాడి వినయపు పలుకుబడిలో చేరిపోయింది.

సీతను వెదకడానికి సుగ్రీవుడు వానరులకు వేసిన ఆజ్ఞ మీరరానిది. అందుకే సుగ్రీవాజ్ఞ మీరరాని కఠిన ఆజ్ఞగా అధికార పలుకుబడిలో జాతీయంగా నిలిచింది. 'చిన్ని నా బొజ్జకు శ్రీరామ రక్ష' అనుకోవాలనుకోవడం స్వార్థంగానో సరదాగానో అనుకోకుండా ఉండలేం.

ఇక దేవుడి పేరు మీద పాడుపనులు చేస్తుంటారు కొందరు. వాళ్ళ చేతిలో ఎప్పుడూ రామాయణ ముంటుంది. నోటిలో రామనామ స్మరణ ఉంటుంది. అలాంటి వారిని రామాయణ పలుకుబడి ఇలా అంటుంది. "చదివేది రామాయణం కూలగొట్టేది దేవ స్థలాలు."

"కలియుగ రావణాసురుడు" ఈ పదం ఉపయోగించని తెలుగు ప్రాంతం లేదంటే అతిశయోక్తికాదు. రావణాసురుడి వంటి స్త్రీ వ్యామోహంతో మొండిపట్టుదల చూపే ప్రబుద్ధుల నాశనంను శపించే ఈ మాట కలికాల రావణాసురులున్నంత కాలమూ ఎప్పటికీ నిష్క్రమించే అవకాశం లేదు. కొన్ని సమస్యలు, వైషమ్యాలు ఎప్పటికీ పరిష్కారమయ్యే అవకాశం లేదు. అవి రగులుతూనే ఉంటాయి. అలా రగులుతూ ఉండడాన్ని రావణాకాష్టంతో పోలుస్తారు.

చితిమంటలారేవరకూ భర్త చనిపోయినా స్త్రీ సుమంగళిగా ఉంటుందని శ్రీరామచంద్రుని వరం. కాష్టం అంటే చితి. రావణుని కాష్టం మంటలలో ఇంకా రగులుతూనే ఉంది. అది ఆరిన రోజున రావణుని భార్య మండోదరి వైధవ్యమును పొందుతుంది. మండోదరి నిత్య సుమంగళిగా ఉండడానికి రావణకాష్టం ఇప్పటికీ మండుతోందని చల్లారని సమస్యలకుదాహరణగా ఈ మాట ఉపయోగిస్తాం.

"రామాయణంలో పీడకల " అనే మాట ఉంది. త్రిజట సీతకు కాపలా ఉన్నప్పుడు రావణ నాశనాన్ని కలగంటుంది. తోటి రాక్షసస్త్రీలకు ఈ పీడకల చెబుతుంది. తెలుగువారు సరసులుకదామరి. దాన్ని 'రామాయణంలో పిడకలవేట' అని ఓ కథ తయారు చేశారు.

పూర్వం కాలక్షేపంగా గ్రామాలలో వీధి వీధిలోను రామాయణ నాటక ప్రదర్శనలు జరిగేవి. ఇంచుమించు తెల్లవారు ఝాము దాకా జరిగేవి. పాడి మేతలోను పంట ఎరువులోను ఉందని రైతు నమ్మకం. అందుచేత ఆవు గేదె వంటి పశువుల పేడను ఎరువుగా వాడతారు. ఆ సమయంలో ప్రత్యేకంగా పేడ మోసుకెళ్ళనవసరం లేకుండా చేలోనే మందకడతారు. పశువులు చేలోనే ఉండి పేడ వేస్తాయి కాబట్టి రైతుకు సౌకర్యంగా పేడ ఎరువు లభిస్తుంది. అలా ఒకసారి తెల్లవారు ఝామున రైతులు పశువులను మందకట్టడానికి తోలుకుని వెళుతున్నారు. రామాయణ ప్రదర్శన జరుగుతున్న వీధిలోకి వచ్చేసరికి కలకలం. ఎందుకంటే పేడ పిడకగా మారితే మంచి వంట చెరకు. గ్రామీణ స్త్రీ పిడకలు చేయడానికి కావలసిన పేడ సేకరించాలని పశువుల వెనక పరుగులెట్టారు. ఆ సమయంలో త్రిజట పీడకల ప్రదర్శన జరుగుతోందో లేదో తెలియదు కాని 'పిడకలవేట' పదం మనకు లభించింది. లేదా 'పీడకల' పలుకుబడిలో నలిగి 'పిడకల'గా పలకబడింది. రామాయణంలోని పిడకల 'వేట' అన్నది తగిలించి సరదా పలుకుబడిగా అందిందన్నది నా ఊహ. ఇంకా అగస్త్యభ్రాత, అలో లక్ష్మణా వంటివి తెలుగు పలుకు బడిలో చక్కటి ఉపమానాలు.

దేనిమీదైనా చులకన భావం కలవారు ఉంటూనే ఉంటారు. రామాయాణాన్ని 'రంకు' అన్నాం. అంతమాత్రాన రామాయణం పవిత్రత చెడదు. భారతాన్ని బొంకు అన్నాం. కాని 'వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి' అన్న పలుకుబడి భారతంతో మనల్ని మమేకం చేసుకుంది. ఎన్నో జీవిత సత్య పలుకుబడులలో సజీవంగా ఉంది. పలుకుబడులలో సజీవంగా ఉంది.

భారతంలోని విరాటపర్వం చదివితే వానలు పడతాయని మన నమ్మకం. అదునుకు వానలు కురవకపోతే నేటికీ విరాటపర్వం చదువుతారు. భారతంలోని పాత్రలన్నీ తమ మంచీ చెడులతో ఉపమానాలకు నిలయమై పలుకుబడిలో విహరిస్తున్నాయి. దుష్టచతుష్టయం, దానకర్ణుడు, ఉత్తరకుమార ప్రజ్ఞలు... ఇలా ఎన్నో పాత్రలు మనలోని గుణగణాలకు అద్దంపడుతూ కనిపిస్తాయి.

నకుల సహదేవుల మేనమావ శల్యుడు. భారత యుద్ధంలో దుర్యోధనుడి పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడు. కాని పాండవ పక్షపాతి. కర్ణుడికి రథసారథిగా అతడు పాండవులను పొగుడుతూ కర్ణుడిని అవమానపరుస్తూ నిరుత్సాహ పరిచేవాడు. అందుకే స్వపక్షంలో ఉండి ఎదుటి పక్ష విజయానికి కృషి చేసేవాడిని శల్యసారథ్యం చేస్తున్నాడని పోలుస్తాం. మరికొన్ని భారసంబంధ పలుకుబడిని చూద్దాం.

# తెలుగు పలుకుబడి



డా.జొన్నలగడ్డ మార్కండేయులు

**తెలుగుభాషకు** ప్రాచీన హోదా సాధించామంటారు కొందరు. మరికొందరు తెలుగు పలుకు మృతభాష అయిపోతోందని గుండెలు బాదుకుంటున్నారు. ప్రాచీన హోదా వచ్చిందన్న సంతోషంగాని, మృతభాష కాబోతోందన్న విచారముగాని తెలుగు భాషకు ఏమీ మేలు చేయవు. అసలైన తెలుగు జాతీయ పదజాలము మనం మరిచిపోతున్నాం. తెలుగు పలుకుబడిని గుర్తించలేక పోయినా తెలుగు పలుకుబడిని సేకరించడం అందరి కర్తవ్యం అని చెప్పడమే ఈ వ్యాసావళి ప్రధానోద్దేశం.

## 13

### పురాణ పలుకుబడి

**భారతంలోని పాత్రలన్నీ** మన పలుకుబడిలో నిలిచిపోయాయి. మంచి చెడుల పోలికలలో భారత కథా పాత్ర మనకు, ఆదర్శ ప్రాయంగానో, హేళనగానో స్వభావానికి పలుకుబడిలో చురకవేస్తూనే ఉంటుంది. మొండివాడు శిఖండి. భీష్మణ్ణి చంపడానికి అంబ దాల్చిన రూపమే శిఖండి. 'అజాత శత్రువు'గ మంచివాడు ధర్మరాజు అనిపించుకుంటున్నాడు. నకులుడూ గొప్ప అశ్వ శిక్షకుడు. అయితేనేం వనవాసంలో అజ్ఞాతంలో గడిపాడు. అందుకే విశ్వమేలే నకులుడు అశ్వశిక్షకుడు అని గొప్పవాడి అననుకూల పరిస్థితికి జాలిపడుతున్నాం. గొంతెమ్మ కోరికలు అంటే తీర్చ లేనివి గొంతెమ్మ అంటే కుంతీదేవి. కర్ణుని జన్మ రహస్యం దాచినందుకు ధర్మరాజు దండింపబోయాడు. అప్పుడు హరిజన వాడలో దాగుకొంది. వీరు ఆమెను గొంతెమ్మగా పిలిచి గ్రామదేవతగా కొలుస్తున్నారు.

సైంధవుడు పద్మవ్యూహంలో అభిమన్యుని చావుకు కారణమయ్యాడు. వరప్రభావంచేత పాండవులలో అర్జునుడిని తప్ప మిగిలినవారిని నిలవరించగలిగి పద్మవ్యూహంలోనికి రానీయకుండా అడ్డుపడ్డాడు. అందుకే కార్యం చెడిపోవడానికి కారణమైనవాడిని 'సైంధవు'డులా అడ్డుపడ్డాడంటాం. నలుడు, భీముడు వంట చేయడంలో పేరుపొందారు. ఎవరు ఎంత పాకశాస్త్ర ప్రవీణులైనా నలభీములతోనే పోల్చబడుతున్నారు.

ఎర్ర అగ్గిపుల్ల గీయకుండగానే మండుతుంది. ఎర్రగ్గిపుల్ల అని కలహాలు పెట్టేవాళ్ళను పిలుస్తాం. అటువంటి కలహ ప్రియులకు 'నారదుడు' సార్థకనాముడై పురాణాల పలుకుబడినుంచే దిగుమతి అయ్యాడు. స్వపక్ష నాశనమునకు చాపక్రింద నీరులాంటి వాడు శకుని. నాశనము కోరేవాడికి ఉపమానం యాదవకులంలో ముసలం. పేరుచే తెలుసుకోలేని పండితుడిని 'అగస్త్యభ్రాత' అంటాం. మహాభారత యుద్ధంలో పోరాడిన వీరులు 'అతిరథ, మహారథులు' ఏ పోటీలకు నిలబడినా ఉపమానాలవుతున్నారు. 'అష్టదిగ్గజములు' అన్న మాట పురాణాలదే అయినా దిగ్గజము అన్నది కవి ప్రతిభకు ప్రశంసగా నిలుస్తోంది. సత్యభామ అతిశయం, అందం స్త్రీ విలాస విభ్రమాలకు అతిశయ ఉపమానానికి పేరుపడింది.

కామధేనువు, కల్పవృక్షం కోరికలు తీర్చువారికి ఉపమానాలు. అపర అనే శబ్దం తెలుగు పలుకుబడికి చేర్చి ప్రయోగిస్తాం దానకర్ణుడు, శిబిచక్రవర్తి దాతలకు పర్యాయపదములు. ధన్వంతరి గొప్పవైద్యుడికి వేసే ఉపమానం. చండిక అనేది వద్దంటే ఔనని, కాదంటే ఔననే వ్యతిరేకంగా ప్రవర్తించే వ్యక్తులకు ఉపమానం. కుచేలుడు పేదరికానికి ఉపమానం. కీచకుడు, రావణుడు పరస్త్రీ వ్యామోహితుల పేర్లకు బదులుగా నిలుస్తున్నారు. కుంభకర్ణుడు నిద్రాలోలుడు. రామలక్ష్మణులు అనుబంధానికి, వాలి సుగ్రీవులు కొట్టుకోవడానికి పేరు పడ్డారు. జేష్టాదేవి లక్ష్మీ సోదరి అయినా పేదరికానికి తిట్టుగా పర్యాయపదంగా నిలిచింది. నక్షత్రకుడు హరిశ్చంద్రునికి అప్పుతీర్చమని సతాయించాడు. ఇప్పటికీ నక్షత్రకుడిలా తగులుకున్నాడు అనే తెలుగు పలుకుబడి ప్రయోగంలో ఉంది.

ఇద్దరు లేక సమూహతగవులు వీధి కెక్కితే కురుక్షేత్రం అవుతోందంటాం. అగస్త్యుడు మేక రూపం చేసి వాతాపిని భోజనంగా ఇల్వలుడు పొట్టలోకి పంపితే జీర్ణం చేసేశాడు. పసిపిల్లలకు ఉగ్గుపట్టినపుడు రాక్షహారం కూడా జీర్ణమవాలని 'వాతాపిజీర్ణం' అనే కన్న తల్లి పలికిన తెలుగు పలుకు ఆధునిక తల్లికి తెలియదని చెప్పలేం. రాసలీలలు అన్నపదం శృంగార పురుషుల గురించిన వెటకారపు తెలుగు పలుకుబడి అయింది. భద్రకాళి దేవత స్త్రీ కోపించినపుడు ప్రశంసగా ఉపయోగించే పదం. అలాగే ఉగ్రరూపం, ఉగ్రతాండవం పదాలుకూడా. ఉక్కుకౌగిలి అనేమాట దృతరాష్ట్రుడిని బట్టి వచ్చింది. ప్రాణాలు తీసే కౌగిలిగా ఈ తెలుగు పలుకుబడి ప్రాణాంతక స్నేహానికి ఉదాహరణగా నిలిచింది. భీష్మ ప్రతిజ్ఞ ఉత్తమ నిర్ణయానికి వాడే పదం. యముడు, కాలయముడు ప్రమాదకర వ్యక్తులకు తగిలించే ఉపమానాలు.

రాహుకేతువులు బాధించే వ్యక్తులను ప్రస్తావించినపుడు ఉపయోగించేపదం. సుందోపసుందులు ఒకరితో ఒకరు పోరాడుకుని అంతః కలహాలతో కొట్టుకునేవారికి ఉపమానాలయ్యారు. వేదం అనే పదం తిరుగులేనిమాట అనే పదానికి పర్యాయపదముగా స్థిరపడింది.

ఇంకా చిదంబర రహస్యం, విశ్వామిత్ర సృష్టి, భగీరథ ప్రయత్నం, అలో లక్ష్మణా వంటి తెలుగుబడి పురాణగాథలతో బాటు హెచ్చరికలు చేస్తూ భాషను, భావాలను రసమయం చేస్తూ ధర్మబద్ధమైన పలుకుబడిగ అనంతంగా ఉండి పదిలపరచవలసిన ఆవశ్యకతను గుర్తుచేస్తోంది.

కవిత్రయ మహాభారతం, పోతన భాగవతం, శ్రీనాథాది మహాకవుల రచనలు గాక వేమన వంటి శతక కవులు కూడా తెలుగు పలుకుబడిని ప్రజలకందించారు. వేమన పద్యాలన్నీ వేమన వేదంగా తెలుగు పలుకుబడిలో ఉపయోగంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. సుమతి, భాస్కర, కుమారి వంటి శతకాల్లోని పాదాలు తెలుగు పలుకుబడిలో ప్రయోగమవుతూనే ఉన్నాయి. అందుచేత శతకసాహిత్యం చదివినా చదివించగలిగినా మాట చమత్కారపు తెలుగు నుడి పరభాషా వ్యామోహం నుంచి విముఖులను చేసి తెలుగుపలుకుబడి సొగసులు ఆస్వాదించే స్థాయికి నేటితరాన్ని ప్రభావితం చేయగలవు. మొల్ల తన కవిత్వం "తెనుగునకున్ పొందై, రుచియై, వీనుల విందై" ఉండాలని ఆశించి తన కవిత్వ పద ప్రయోగం తెలుగు పలుకుబడిని కలిగి ఉందని చెప్పింది. జానపదగేయ వాఙ్మయమంతా నిత్య వ్యవహార తెలుగుపలుకుబడి కలిగి ఉంది. ఈ తెలుగు పలుకుబడి సేకరణకు ఎందరు నడుం కట్టినా ఎప్పుడూ నూతనంగానే ఉంటుంది.

జీవితంలోని అన్ని కోణాలనుంచి, వివిధరంగాలనుంచి, శాస్త్రాలనుండి నమ్మకాలవాకు సామాజిక జీవనం తనదైన పలుకుబడిని మనభాష కలిగి ఉంది. శాస్త్రయుగంలో పరిశోధనాంశాలు తెచ్చిన అన్యభాష కలిగి ఉంది. శాస్త్రయుగంలో పరిశోధనాంశాలు తెచ్చిన అన్యభాషాపదాలు ఏరిపారేయమని చెప్పడం నా ఉద్దేశం కాదు. 'అమ్మ' అని గుండెలోతుల్లోంచి ఉబికి వచ్చే అసలు సిసలైన తెలుగు పలుకు ఆర్ధ్రతకు మనం దూరమవకుండా తెలుగులోనే సంభాషించాలన్న ఆశ మనందరం కలిగి ఉందాం. అందుకే ఈ పదం ఎంత గొప్ప హెచ్చరికో అనే పలుకుబడిని పరభాషా మోజులో మరిచిపోకుండా సేకరిద్దాం. సంభాషిద్దాం. ఎందుకంటే మారుతున్న కాలంలో, మారని కాలంలో కూడా మారని మానవ స్వభావానికి నాగరికంగా అందించగలిగేది తరతరల మన తెలుగు పలుకుబడిని దూరం చేసుకోవద్దు. పరభాషా పదాలపై విముఖత అవసరం లేదు. చిన్నదైపోతున్న ప్రపంచంలో వాటి అవసరమూ ఉంది. కాని సామాజిక జీవన ప్రయాణంలో

ప్రమాణాలుగా నిలిచే తెలుగుపలుకుబడికి మనం స్వాగతం పలుకుతూనే ఉండాలి. సంభాషణలో తెలుగు వారిమన్న గుర్తింపుతో ప్రపంచ ప్రజలతో ఏకాత్మ భాసిల్లి ప్రవర్తించాలి.

✵ ✵ ✵

(అయిపోయింది)